# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 253 | హైదరాబాద్ | గురువారం 02-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

మార్కో రూబియో

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు

# తెలంగాణ బీజేపీ మద్దతు: కిషన్ రెడ్డి

- లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ
- సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందన్న కిషన్ రెడ్డి
- కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని వ్యాఖ్య
- విభజన తర్వాత రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలన్న కిషన్ రెడ్డి

11లో







## "అల్లుడు తులం బంగారం అడుగుతున్నాడు" 11లో

## తలసాని వద్ద మహిళ ఆవేదన

- సికింద్రాబాద్‌లోని తహసీల్దారు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ
- ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించిన మహిళ
- ఆ బంగారం ఇస్తామని చెప్పడంతో అల్లుడు అడుగుతున్నాడన్న మహిళ

## ఎల్పీజీ సెగ

# హైవేపై ట్రాఫిక్ జామ్

- హైదరాబాద్‌లో తీవ్రమైన ఎల్పీజీ గ్యాస్ కొరత
- రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు
- నగరంలో పలుచోట్ల భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



11లో



## టికెట్ క్యాన్సిలేషన్

# ప్రయాణికులకు షాక్!

- రైల్వే టికెట్ రద్దు, రిఫండ్ నిబంధనల్లో కీలక మార్పులు
- రైలు బయల్దేరడానికి 8 గంటలలోపు రద్దు చేస్తే రిఫండ్ సున్నా
- 8 నుంచి 24 గంటల మధ్య రద్దుకు టికెట్ ధరలో 50 శాతం కోత
- ఏజెంట్ల దందాకు చెక్ పెట్టేందుకే ఈ కొత్త విధానం
- ఏప్రిల్ 1 నుంచి దశలవారీగా దేశవ్యాప్తంగా అమలు

11లో

## చండీగఢ్ బిజెపి ఆఫీస్ వద్ద

# భారీ పేలుడు..

- పార్క్ చేసి ఉంచిన స్కూటీలో పేలుడు
- సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు బృందాలు, అగ్నిమాపక సిబ్బంది
- భారీ మొత్తంలో నష్టం జరగలేదన్న బీజేపీ నాయకులు




11లో

## ఒకే ఒక రాజధాని...

# అమరావతికి ఇక తిరుగులేదు

- లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు ఆమోదం
- ఇది ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- రాజధానిపై సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని స్పష్టీకరణ
- సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి ధన్యవాదాలు
- అమరావతిని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని హామీ

11లో






11లో

## మళ్లీ భారీగా పెరిగిన

# బంగారం, వెండి ధరలు

- రూ.9 వేలు పెరిగి రూ.2.46 లక్షలు పలికిన వెండి
- రూ.3,500 పెరిగి రూ.1.55 లక్షలు పలికిన 24 క్యారెట్ల పసిడి
- రూ.1.51 లక్షలు పలికిన 22 క్యారెట్ల పసిడి

## కాజీపేట రైల్వే డివిజన్‌ను

# తక్షణమే ఏర్పాటు చేయండి

అశ్వినీ వైష్ణవ్‌కు కేటీఆర్ లేఖ

- సికింద్రాబాద్ డివిజన్‌పై పని భారం విపరీతంగా పెరిగిందన్న కేటీఆర్
- కేటీఆర్ లేఖను కేంద్రమంత్రికి అందించిన బీఆర్ఎస్ ఎంపీల బృందం
- కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడి



11లో

భారత శక్తి

# కేరళలో ఐదు గ్యారంటీలు గట్టెక్కిస్తాయా

ఆరు గ్యారంటీలు ఇచ్చి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇదే తరహా వ్యూహాన్ని కేరళంలోనూ అమలు చేస్తోంది. మలయాళీలకు ఐదు గ్యారంటీలను హస్తం పార్టీ ఆఫర్ చేస్తోంది. తెలంగాణ తరహాలోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే అక్కడి బడ్జెట్ పరిమితులు, ప్రజల ఆలోచనా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని మిగతా హామీల అమలు విషయంలో హస్తం పార్టీ ఆచితూచి వ్యవహరించింది.ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా.. ఏప్రిల్ 9న కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్‌కు కొద్ది రోజులే గడువు ఉండటంతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈసారి కేరళంలో బీజేపీ కూడా బలంగా ప్రచారం చేస్తోంది. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో త్రిముఖ పోరు ఉండే అవకాశం ఉంది. అయితే చాలా చోట్ల మాత్రం పోటీ ప్రధానంగా అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్ మధ్యే ఉండే అవకాశం ఉంటుందని అంచనా. గత పదేళ్లుగా కేరళలో అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తుండగా.. ఈసారి ఎలాగైనా మలయాళీల మనసు గెలవాలని హస్తం పార్టీ పట్టుదలతో ఉంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ.. ఇప్పుడు మలయాళ గడ్డ మీద పాగా వేయడం కోసం ఐదు గ్యారంటీలను సిద్ధం చేసింది. మహిళలు, యువతను తమవైపు తిప్పుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ హామీలను ఇచ్చింది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కేరళంలోనూ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణల్లో ఈ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.కాలేజీలకు వెళ్లున్న అమ్మాయిలకు నెలకు రూ.1000 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని కేరళంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. తెలంగాణలో ప్రతి మహిళకు నెలకు రూ.2500 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీ తెలంగాణలో ఇంకా అమలు కాలేదు. దీంతో కేరళంలో ఈ హామీని మార్చారని భావించొచ్చు.కేరళలో ప్రస్తుతం నెలకు రూ.2 వేల చొప్పున పెన్షన్లు ఇస్తుండగా.. దాన్ని రూ. 3 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. తెలంగాణలో ఫించన్లను రూ.4 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే ఈ హామీ కూడా ఇంకా అమలు చేయలేదు.ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమాను అందిస్తామని కేరళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ పథకానికి కేరళ మాజీ సీఎం ఉమెన్ చాందీ పేరు పెడతామని ఆ పార్టీ ప్రకటించింది. తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కారు ఆరోగ్య శ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే.యువత వ్యాపారాలు చేసుకోవడానికి వీలుగా చిన్న వ్యాపారాల కోసం రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని కేరళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వృద్ధుల సంక్షేమాన్ని పర్యవేక్షించడం కోసం ప్రత్యేకమైన మంత్రిని నియమిస్తామని కేరళ కాంగ్రెస్ ప్రకటించింది. రబ్బరు సాగు చేసే రైతులను ఆకట్టుకోవడం కోసం కిలో రబ్బరుకు రూ.250 చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని ఎకరానికి ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల ముంగిట హామీ ఇచ్చింది. అలాగే వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, వరికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సాయం 'రైతు భరోసా'ను ఎకరానికి రూ.12 వేలకు మాత్రమే పెంచింది. రూ.2 లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీని దాదాపుగా నెరవేర్చింది.ఇందిరమ్మ ఇండ్లు పేరిట సొంత స్థలం ఉన్న పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని, గృహ జ్యోతి కింద ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తామని తెలంగాణ ఎన్నికల ముంగిట హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ హామీలను అమలు చేస్తోంది. అలాగే పేద కుటుంబాలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలంగాణలో హస్తం పార్టీ హామీ ఇచ్చింది.యువ వికాసం కింద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం రూ.5 లక్షల వరకు సాయం చేస్తామని.. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది.మహిళలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఉచిత బస్సు ప్రయాణం హామీని ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఇచ్చింది. రైతుల కోసం తెలంగాణలో పెట్టుబడి సాయాన్ని భారీగా పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ ఆ స్థాయిలో పెంచలేకపోయింది. అలాగే తెలంగాణలో మహిళలందరికీ రూ.2500 చొప్పున ప్రతినెలా ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. ఇంకా అమలు కాలేదు. దీంతో కేరళంలో కాలేజీకి వెళ్లే అమ్మాయిలకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున సాయం చేస్తామని హామీ ఇచ్చింది.ఆరోగ్య బీమా విషయంలో మాత్రం తెలంగాణ కంటే మెరుగ్గా కేరళంలో హామీ ఇచ్చింది. తెలంగాణకు వచ్చే ఆదాయం ఎక్కువ, ఇక్కడి బడ్జెట్ ఎక్కువ. సంక్షేమ పథకాలకు ఇక్కడ ప్రాధాన్యం ఎక్కువ. దీంతో సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణలో కాంగ్రెస్ హామీలు ఇచ్చింది. 2026-27 తెలంగాణ బడ్జెట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకే రూ.50 వేల కోట్లకుపైగా కేటాయించింది.కానీ కేరళం విషయానికి వస్తే.. ఆ రాష్ట్ర ఆదాయం తెలంగాణతో పోలిస్తే తక్కువ. అక్కడి ప్రజలు బాగా చదువుకున్నవారు. ఇప్పుడు అక్కడున్న ఉచిత పథకాలు కూడా తెలంగాణ స్థాయిలో లేవు. దీంతో అక్కడి పరిస్థితులకు తగ్గట్టుగా, మలయాళీలను ఆకట్టుకునేలా హామీలు ఇచ్చింది. తెలంగాణలో లాగే కేరళంలోనూ మహిళలు, యువతను తమవైపు తిప్పుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నం ఎంత మేర సక్సెస్ అవుతుందనేది మరి కొద్ది రోజుల్లోనే తేలనుంది.

# జనసేనలోకి వంగా గీత

కాకినాడ, ఏప్రిల్ 1

రాష్ట్ర రాజకీయాల్లో పిఠాపురం నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం. గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఈ నియోజకవర్గ నుంచి పోటీ చేసిన తర్వాత దీని ప్రాధాన్యం పెరిగింది. గత కొంతకాలంగా ఇక్కడ కూటమి దూకుడుగా ఉంది. రాష్ట్ర డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తుండడంతో అభివృద్ధి సైతం పరుగులు పెడుతోంది. ఇంకోవైపు టిడిపి ఇన్చార్జిగా మాజీ ఎమ్మెల్యే వర్మ ఉన్నారు. కూటమిపై రకరకాల అభిప్రాయాలు ఉన్న ఇక్కడ మాత్రం బలంగానే ఉంది. ఈ తరుణంలో ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు తగ్గాయి. ఆ పార్టీ క్యాడర్లో నిరుత్సాహం అలుముకుంది. పవన్ పై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వంగా గీత ఇప్పుడు పెద్దగా యాక్టివ్ గా లేరు. ఆ నియోజకవర్గంలో వైసిపి గెలిచే ఛాన్స్ లేదని తెలిసి ఆమె పూర్తిగా సైడ్ అయినట్లు ప్రచారం నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి సైతం తాను అక్కడ పని చేయలేనని క్లియర్ కట్ గా చెప్పినట్లు సమాచారం.మొన్నటి ఎన్నికల్లో కాకినాడ ఎంపీగా ఉన్న వంగా గీతను తీసుకొచ్చి పిఠాపురంలో పోటీ చేయించారు. మహిళ నేతకు కావడంతోపాటు గతంలో పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడంతో ఆమె వైపు మొగ్గు చూపారు. ఆపై ముద్రగడ పద్మనాభం సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఇచ్చేది పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. దీంతో ఊరు హోరాహోరీగా ఉంటుందని అంతా భావించారు. కానీ అటువంటి పరిస్థితి లేదు. ఏకంగా 70000 ఓట్లకు పైగా



మెజారిటీతో గెలిచారు పవన్ కళ్యాణ్. గెలిచిన తరువాత మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ నియోజకవర్గం వర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. అక్కడి ప్రజలు పవన్ కళ్యాణ్ పనితీరు పట్ల సంతృప్తిగా ఉన్నారని కూడా తెలుస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ధైర్యం చెప్పే నేతలు లేకుండా పోయారు. రాష్ట్రస్థాయి విషయాలు మాట్లాడేందుకే అన్నట్టు ముద్రగడ పద్మనాభం పరిస్థితి ఉంది. వంగా గీత సైతం పార్టీ శ్రేణులకు పెద్దగా ప్రయారిటీ ఇవ్వడం లేదు. స్థానికంగా కూడా అందుబాటులో లేరని తెలుస్తోంది. కొద్దిరోజుల కిందట జగన్మోహన్ రెడ్డి వంగా గీతను పిలిచి మాట్లాడారట. పిఠాపురం నియోజకవర్గంలో యాక్టివ్ కావాలని సూచించారట. అందుకు ఆమె అంగీకరించలేదట. పవన్ కళ్యాణ్ ఉండగా పిఠాపురం నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ గెలిచే పొజిషన్లో లేదని.. అందుకే తాను నియోజకవర్గ ఇన్చార్జి పోస్టును తీసుకోలేనని ఆమె తేల్చి చెప్పారట. తెలుగుదేశం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన వంగా గీత ప్రజారాజ్యం పార్టీలో కూడా పనిచేశారు. అందుకే ఆమె విషయంలో పవన్ కళ్యాణ్ సైతం గౌరవంగానే మెలిగారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఆమెను జనసేనలో చేర్చుకుంటామని కూడా బాహటంగానే చెప్పారు పవన్. అయితే ఇప్పుడు వంగా గీత వ్యవహార శైలి చూస్తుంటే ఆమె జనసేనకు దగ్గరవుతారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# వైసీపీ కొత్త గేమ్ ప్లాన్

విజయవాడ, ఏప్రిల్ 1,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు ఒక కొత్త పోరాటం మొదలైంది. అసెంబ్లీలో తగినంత సంఖ్యాబలం లేకపోయినా, అధికార కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసీపీ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తోంది.



రాష్ట్ర స్థాయిలో శాసనమండలిని, జాతీయ స్థాయిలో పార్లమెంటును వేదికలుగా చేసుకుని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే ఈ కొత్త గేమ్ ప్లాన్ అసలు ఉద్దేశంగా కనిపిస్తోంది.అసెంబ్లీలో వైసీపీ బలం తక్కువగా ఉండటంతో, సభా కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది వైసీపీ. అయితే శాసనమండలిని మాత్రం వదులుకోవడం లేదు. మండలిలో వైసీపీకి మెజారిటీ ఉండటాన్ని పూర్తిస్థాయిలో అనుకూలంగా మార్చుకుంటోంది. ఇటీవల 15 రోజుల పాటు జరిగిన సమావేశాల్లో వైసీపీ ఎమ్మెల్సీలు ప్రతిరోజూ ప్రభుత్వాన్ని నిలదీశారు.ముఖ్యంగా తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారం, టీటీడీ నిర్ణయాలు, రైతుల సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగ భర్తీ వంటి అంశాలపై వైసీపీ గట్టిగా పోరాడింది. లడ్డూ వివాదంపై చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టి, వరుసగా వాయిదా తీర్మానాలు ఇచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. చివరకు ప్రభుత్వం పూర్తిస్థాయి చర్చకు సిద్ధం కాకపోయినా, కనీసం స్టేట్‌మెంట్ ఇచ్చేలా చేయగలిగింది. దీన్ని వైసీపీ నేతలు తమ నైతిక విజయంగా చెప్పుకుంటున్నారు. మండలిలో ఉన్న బలాన్ని వాడుకుంటూ అధికార పక్షాన్ని సమాధానం చెప్పాల్సిన పరిస్థితికి నెట్టడంలో వారు సఫలమవుతున్నారు.అదే సమయంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో పార్లమెంట్ వేదికను వైసీపీ వ్యూహాత్మకంగా వాడుకుంటోంది. వైసీపీ ఎంపీలు పార్లమెంట్‌లో గళం విప్పుతున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ దాడులు, శాంతిభద్రతల సమస్యలు, అమరావతి అప్పుల అంశాలను వారు ఢిల్లీ వేదికగా ఎండగడుతున్నారు.ఈ వ్యూహంలో భాగంగానే అనంతపురం జిల్లాకు చెందిన ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు విదేశీ నిధుల వెసులుబాటు కల్పించడంలో వైసీపీ చేసిన పోరాటం ఫలితాన్ని ఇచ్చిందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి తిరిగి అనుమతులు ఇవ్వడం తమ విజయమేనని వారు ఘంటాపథంగా చెబుతున్నారు.అసెంబ్లీని స్కిప్ చేసినా.. మండలి, పార్లమెంట్ ద్వారా తమ వాయిస్‌ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైసీపీ భావిస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో ఎమ్మెల్సీలు, మరోవైపు ఢిల్లీలో ఎంపీలు సమాంతరంగా పోరాటం చేస్తుండటంతో కూటమి సర్కార్ రక్షణలో పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ డ్యూయల్ స్ట్రాటజీ ద్వారా వైసీపీ తన ఉనికిని చాటుకోవడమే కాకుండా, కూటమి వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచగలుగుతోంది

# 2027 నాటికి మామునూరు ఎయిర్ పోర్ట్

వరంగల్ , ఏప్రిల్ 1

హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే ప్రఖ్యాతి పొందింది. అయితే ఇప్పుడు తెలంగాణలోని మరో ఎయిర్ పోర్ట్ నిర్మాణంతో మరోసారి విమాన రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే అవకాశం ఉందని కొందరు అంటున్నారు. వరంగల్ జిల్లా మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించి సాంకేతిక సహాయం అందించేందుకు వరంగల్ నీట్ కు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయగా.. తదుపరి చర్యల్లో భాగంగా సాంకేతిక సహాయం తో పాటు సూపర్వైజింగ్ చేయాలని ప్రభుత్వం నీట్ ను కోరింది. దీంతో ఈ ఎయిర్‌పోర్ట్ పై ఇప్పుడు ఆసక్తిగా చర్చ సాగుతోంది.వరంగల్ జిల్లాలోని మామునూరు లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి రూ. 850 కోట్లు అవసరం ఉండనుంది. ఇందులో ఆధునిక టెర్మినల్ భవనానికి, రహదారి ఏర్పాట్లకు, ట్రాఫిక్ కంట్రోల్ తో పాటు ఫైర్ సేఫ్టీ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా 2027 చివరి నాటికి ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి విమాన సర్వీసులు ప్రారంభించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంది. అయితే ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో వరంగల్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని కొందరు అంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో ఐటీ సెక్టార్ ఎదిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో ఇక్కడ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.అలాగే ఇక్కడ మెగా టెక్స్టైల్ పార్క్ కూడా ఏర్పాటు కావడంతో ఇది అంతర్జాతీయంగా కనెక్ట్ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ఇలా పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెబుతున్నారు.

# మారనున్న రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు

విశాఖపట్టణం, ఏప్రిల్ 1,

లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలని పునర్విభజించాలని.. వాటి సంఖ్య 50శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో.. ఏపీలో భౌగోళికంగా, రాజకీయంగా కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయ్. 50 శాతం సీట్లు పెంచాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంతో.. రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల సంఖ్య 263కి పెరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా.. ఏకంగా 88 అసెంబ్లీ స్థానాలు పెరగడంతో.. యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చట్టసభల్లో మరింత ప్రాతినిధ్యం పెరుగుతుంది. కొత్త నాయకత్వం అభివృద్ధి చెందుతుంది. చదువుకున్న యువత రాజకీయాల్లోకి వచ్చేందుకు ఈ పరిణామం ఉపయోగపడుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. ఎమ్మెల్యేల సంఖ్య పెరిగితే.. దానికి తగినట్లుగా శాసన మండలిలోనూ సభ్యుల సంఖ్య పెరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉన్నాయ్.నియోజకవర్గాల పునర్విభజన అనేది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠకు దారి తీస్తోంది. కొత్తగా 88 నియోజకవర్గాలు ఏర్పాటు చేస్తారనే ప్రచారంతో.. రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయ్. మరీ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో జరగబోయే మార్పులపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఆయా వర్గాలకు కొత్తగా రిజర్వ్ అయ్యే నియోజకవర్గాలపై.. ఇప్పటి నుంచే లెక్కలు కనిపిస్తున్నాయ్. యాడ్ అయ్యేది ఏంటి.. కోల్పోయేది ఏంటంటూ అంచనాలు వేసుకుంటున్నారు మరికొందరు నేతలు. ప్రస్తుతం చట్టసభల్లో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాల్లో.. మొత్తం 36 ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలుగా ప్రకటించారు. ఇందులో 29 ఎస్సీలకు.. 7ఎస్టీలకు రిజర్వ్ చేశారు. ఐతే ఇప్పుడు డీలిమిటేషన్‌తో నియోజకవర్గాలు పెరిగితే.. రిజర్వ్‌డ్ స్థానాలు కూడా పెరుగుతాయ్.ఏపీలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 263కు చేరితే.. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు కూడా రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ చట్ట ప్రకారం.. డీలిమిటేషన్ తర్వాత.. ఎస్సీలకు దాదాపు 45 స్థానాలు.. ఎస్టీలకు 12 స్థానాలు రిజర్వ్ అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. ప్రస్తుతం ఎస్సీలకు రిజర్వు చేసిన స్థానాలు.. దాదాపు ప్రతి జిల్లాలో ఉండగా.. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రెండేసి స్థానాలు కేటాయించారు. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలు ఎక్కువగా ఉత్తరాంధ్రకే పరిమితం చేశారు. పోలవరం జిల్లా పరిధిలోని రంపచోడవరం తప్ప.. మిగిలిన ఆరు ఎస్టీ నియోజకవర్గాలు ఉత్తరాంధ్రలోని పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లా పరిధిలోనే ఉన్నాయ్. ఇక అరకు పార్లమెంటు నియోజకవర్గానికి ఎస్టీలకు కేటాయించారు. ఐతే ఇప్పుడు డీలిమిటేషన్ ప్రతిపాదనలతో.. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయ్.ఆంధ్రప్రదేశ్ పర్యాటకంఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలను ఆశిస్తున్న వాళ్లు.. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న వాళ్లు.. డీలిమిటేషన్ పరిణామాలతో తీవ్ర ఉత్కంఠ అనుభవిస్తున్న పరిస్థితి. కొత్తగా 88 స్థానాలు రాబోతుండడంతో.. నియోజకవర్గాల ముఖచిత్రం పూర్తిగా మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో నేతలు తమ అనువైన నియోజకవర్గాల ఏర్పాటు కోసం లెక్కలు వేసుకుంటున్నారు. తమకు పట్టున్న ప్రాంతాలను రిజర్వేషన్ కేటగిరీలో పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్న కొందరు సీనియర్ నేతలు.. ఇప్పుడు తమ నియోజవర్గాన్ని రిజర్వేషన్ కేటగిరీ నుంచి తప్పించి జనరల్ చేసుకోవాలని.. ముందు నుంచే పావులు కదుపుతున్నారట. ఏమైనా.. నియోజకవర్గాల పునర్విభజన మొదలైతే.. రాబోయే రోజుల్లో రాజకీయం సరికొత్త మలుపులు తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ ఏప్రిల్ 1,

మంత్రి గురువారం ఉదయం ఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్తో భేటీ కానున్నారు. పెండింగ్ లో ఉన్న పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులపై చర్చించనున్నారు. రూ. 430 కోట్ల విలువైన కేంద్ర పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై కేంద్రానికి వివరించనున్నారు. రాష్టానికి మరో 9 కొత్త పర్యాటక ప్రాజెక్టులు కావాలని ప్రతిపాదించనునన్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ , శాస్కి పథకాల కింద ఐకానిక్ పర్యాటక కేంద్రాల అభివృద్ధి , ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ల బలోపేతంపై కేంద్రానికి డీపీఆర్ లు సమర్పిస్తారు. గతంలో కీలకమైన పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టుల ఆమోదం కోసం తీవ్ర ప్రయత్నాలు.. ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు ముమ్మరం మంత్రి దుర్గేష్ చేసారు.

ప్రసాద్ స్కీమ్ క్రింద రూ.48.95 కోట్లతో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని శ్రీ గృహ మల్లేశ్వర స్వామి ఆలయం,రూ.36 కోట్లతో కోరుకొండలోని శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయం, రూ.120 కోట్లతో వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానాలకి నిధులు కోరనున్నారు

# వైసీపీ క్రెడిట్ వార్

కడప, ఏప్రిల్ 1,

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమై రెండేళ్లు అవుతోంది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఏ ప్రాజెక్టులు పూర్తయినా.. కొత్తవి వస్తున్నా.. అవి తమ క్రెడిట్ అన్నట్టు వ్యవహరిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తిరిగి క్రెడిట్ చోరీ అంటూ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతోంది. మొన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి తాము చేసింది చెప్పుకోలేదని చెబుతున్నారు. ఇప్పుడు ఇదిగో మేం చేసాం అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు. తాజాగా శ్రీకాకుళం జిల్లాలో ఛలో మూలపేట పోర్ట్ అంటూ సౌండ్ చేసింది వైసిపి. టెక్కలి నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న ఈ పోర్టు నిర్మాణం తుది దశకు చేరుకుంది. కానీ తమ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం జరిగింది అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త వాదనను తెస్తోంది. తమ హయాంలోనే 70 శాతం పనులు జరిగాయని.. తమకి క్రెడిట్ ఇవ్వాలని కోరుతోంది. నిన్ననే ఆ పోర్టు వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి వైసిపి నాయకులు గట్టిగానే సౌండ్ చేశారు. 2023లో ఈ పోర్టు పనులను ప్రారంభించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడకు ఏడాది కాలంలోనే ఎన్నికలు వచ్చాయి. అయితే తాము దిగిపోయే నాటికి 70% పనులు పూర్తి చేశామని చెబుతోంది ఆ పార్టీ. ఏడాది కాలంలో 70 శాతం పనులు చేస్తే.. ఈ రెండేళ్ల కాలంలో 30% పనులు జరిగాయా అనే ప్రశ్న వినిపిస్తోంది. పైగా వైసీపీ హయాంకంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే పనులు వేగవంతం అయ్యాయన్న వాదన ఉంది. కానీ వైసీపీ ఆలోచన అదికాదు. ఈ పోర్టు నిర్మాణంలో తమ పార్టీ ముద్ర ఉండాలని బలంగా కోరుకుంటుంది. పైగా అదనపు భూసేకరణ అనే అంశం తెరపైకి వస్తే దానిని పట్టుకొని పోరాటం చేయాలని చూస్తోంది. తద్వారా టెక్కలి నియోజకవర్గంలో పాటు శ్రీకాకుళం జిల్లాలో పట్టు పెంచుకోవాలని భావిస్తోంది. అందుకే ఉత్తరాంధ్ర నుంచి వైసిపి నేతలంతా ఈ కార్యక్రమానికి కదలి వచ్చారు. ప్రస్తుతం మూలపేట పోర్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దాదాపు తుది దశకు చేరుకుంటున్నాయి. ఈ ఏడాది నవంబర్ నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి పోర్టు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ సమాచారంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టు పూర్తయ్యాక క్రెడిట్ కోసం ప్రయత్నిస్తుంటారు. కానీ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇది మా వల్లే సాధ్యం అయింది అని ప్రజల్లోకి సంకేతాలు పంపించగలిగింది. అయితే దీనిని కూటమి ధీటుగానే బదులిస్తోంది. ఈ క్రెడిట్ ఆరాటాన్ని ప్రజలు పట్టించుకోరని తేల్చి చెబుతోంది.

# అడకత్తెరలో పోక చెక్కలో అమెరికా


న్యూఢిల్లీ, ఏప్రిల్ 1

ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందని ఆరోపిస్తూ డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై యుద్ధం ప్రకటించాడు. కానీ ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడం అమెరికా దీర్ఘకాలిక లక్ష్యం. వివిధ జాతి, మత వర్గాలను రెచ్చగొట్టి, అంతర్గత అస్థిరత సృష్టించాలని వాషింగ్టన్ ఎత్తులు వేసింది. కానీ, ఆ ప్రణాళికలు వికటించి, అమెరికా తాను సృష్టించిన సంక్షోభంలో తానే చిక్కుకుపోయింది. ఇప్పుడు ముందుకు సాగలేక.. వెనక్కి రాకపోలేక నానా తంటాలు పడుతోంది.ఇరాన్ జనాభాలో సుమారు 10 శాతం ఉండే కుర్దులు, ఇస్లామిక్ పాలనకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా పోరాడుతున్నారు. సిరియాలో ఐఎస్ఐఎస్‌ను ఎదుర్కొనేందుకు అమెరికా సైన్యమే వీరికి శిక్షణ ఇచ్చింది. ఆ అనుభవంతో కుర్దిష్ పెష్మెర్గా (మృత్యుదళం) ఇరాన్ సరిహద్దులు దాటి భూతల యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉంది. తుర్కియే, ఇరాన్ మధ్య నలిగిపోయిన కుర్దులు, ఈ దాడుల్లో పాల్గొంటే తమకు భారీ ప్రతిఫలం దక్కుతుందని ఆశించింది. కుర్దిష్ గ్రూపులు ఇరాన్‌పై పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇరాక్‌లో ఉన్న కుర్దిష్ దళాలు ఇరాన్‌లోకి చొరబడేందుకు ఆయుధ విభాగాలను సిద్ధం చేస్తున్నాయి.పాకిస్తాన్‌పై దీర్ఘకాలిక పోరాటం చేస్తున్న బలూచ్‌లను కూడా అమెరికా వాడుకోవాలని చూస్తోంది. గతంలో 'సీపెక్' ప్రాజెక్టును వ్యతిరేకించి, చైనా ఇంజినీర్లపై దాడులు చేసిన బలూచ్‌లు, అమెరికా మద్దతును ఆశిస్తున్నారు. కానీ, బలూచ్‌లకు హామీ ఇస్తే పాకిస్తాన్‌ను దూరం చేసుకోవాల్సి వస్తుంది. ఇజ్రాయెల్‌కు మాత్రం ఈ సమస్య లేదు, అయితే భూతల యుద్ధం ప్రారంభమైతే మొత్తం ప్రాంతం గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉంది.ఇరాన్ విషయంలో అమెరికా ప్రాథమికంగా భావించిన దానికి విరుద్ధంగా పరిస్థితులు మారాయి.. సుప్రీంలీడర్ మరణంతో ఇరాన్ విచ్ఛిన్నమవుతుందని, అసంతృప్తితో ఉన్న ప్రజలు వీధుల్లోకి వస్తారని, కుర్దులు, బలూచ్‌లు తిరగబడితే సులభంగా గెలుస్తామని అమెరికా అంచనా వేసింది. కానీ ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. యుద్ధం కారణంగా ప్రజల్లో ఐక్యత పెరిగింది. అంచనాలు తలకిందులు కావడంతో అమెరికా ఇప్పుడు తక్కువ నష్టంతో బయటపడలేని సంకట స్థితిలో ఉంది.యుద్ధానికి ముందు ప్రజాదరణ కోల్పోయిన ఇరాన్ ప్రభుత్వం యుద్ధం మొదలైన తర్వాత జాతీయ భావోద్వేగాన్ని రెచ్చగొట్టి ప్రజల మద్దతును సంపాదించుకుంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) స్థానిక మత కేంద్రాల నుంచి సైనికులను చేర్చుకుంటూ, భూభాగంపై గట్టి పట్టును కొనసాగిస్తోంది. అమెరికా నిఘా నివేదిక కూడా ఇరాన్ ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి లేదని నిర్ధారించింది.అమెరికా ఇరాన్‌లో చేస్తున్న పొరపాటు, నాడు అఫ్గానిస్తాన్‌లోనూ చేసింది. అఫ్గాన్‌లో హజారాలను శిక్షణ ఇచ్చి తాలిబన్‌లకు వ్యతిరేకంగా ఉసిగొల్పింది. వాళ్లు 20 ఏళ్లు పరస్పరం దాడులు చేసుకున్నారు. చివరికి అమెరికా వెనుదిరిగి, తాలిబన్‌లతోనే ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఇరాన్‌లో అమెరికా పరిస్థితి ఇలాగే కనిపిస్తోంది.అమెరికా, ఇజ్రాయెల్ తమ సొంత సైన్యాలను పంపించాలనుకున్నా, నిపుణులు దీనిని వ్యూహాత్మకంగా తప్పుడు ఎత్తుగడగా భావిస్తున్నారు. ఇరాన్ సంక్లిష్ట పర్వత, ఎడారి భౌగోళిక పరిస్థితులు, స్థానిక జనాభా మద్దతు లేకపోవడం, ఐఆర్‌జీసీ బలమైన నెట్‌వర్క్ కలిగి ఉండడం, హార్ముజ్ జలసంధి మూసివేత ముప్పు అమెరికాను భయపెడుతున్నాయి.మొత్తంగా ఇప్పుడు అమెరికా ముందుకూ కదల్లేక, వెనక్కీ వెళ్లలేని పరిస్థితిలో ఉంది. ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తే, ప్రాంతీయ యుద్ధం తప్పదు. వెనుదిరిగితే, అంతర్జాతీయ ప్రతిష్ట దెబ్బతింటుంది. ఇప్పటికే ఆయిల్ ధరలు పెరిగి, అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక భేదాలు తలెత్తుతున్నాయి. తప్పుడు అంచనాలపై నిర్మించిన వ్యూహం ఇలా కుప్పకూలింది.

# నిఘా కళ్లలో అమరావతి

గుంటూరు, ఏప్రిల్ 1,

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. రాజధాని నగర పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తూ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కీలక ప్రకటన విడుదల చేశారు. రాజధాని ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని అవాంఛనీయ ఘటనలు, అమరావతి నిర్మాణం తిరిగి ఊపందుకుంటున్న వేళ విద్రోహక శక్తులు తలదూర్చకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ హై అలర్ట్ ప్రకటించినట్టు తెలుస్తోంది. ఈ భద్రతా వ్యూహంలో భాగంగా తక్షణమే అమలులోకి వచ్చేలా ఆరు ప్రధాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కేవలం పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం ఈ కొత్త ప్రోటోకాల్ ప్రధాన ఉద్దేశం. రాజధాని లోపలికి వచ్చే, బయటకు వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసేందుకు 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. దీని వల్ల అనుమానితుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఆధునిక సాంకేతికతను జోడించి, రాత్రి సమయాల్లో క్షేత్రస్థాయిలో పోలీసులు వెళ్లలేని ప్రాంతాలను సైతం గమనించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఈ డ్రోన్ కెమెరాలు నిరంతరం ఆకాశం నుంచి నిఘా వేసి, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేస్తాయి. పోలీసు వాహనాలు నిరంతరం రాజధాని రహదారులపై గస్తీ తిరుగుతూ ఉంటాయి. ఇది నేరస్తుల్లో భయం కలిగించడమే కాకుండా, స్థానికుల్లో, నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికుల్లో భద్రతా భావాన్ని కల్పిస్తుంది. అమరావతిలో ప్రస్తుతం అనేక నిర్మాణ పనులు



శరవేగంగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయా నిర్మాణ సంస్థలకు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాజధాని ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం పోలీసులదే కాదని, సంబంధిత సంస్థలు కూడా సహకరించాలని పోలీసులు పేర్కొన్నారు.ప్రతి నిర్మాణ ప్రాంగణంలో హైడెఫినిషన్ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. నిర్మాణ సంస్థలు తమ సొంత సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకొని, పగలు, రాత్రి వేళల్లో గస్తీ కాయాలి. నిర్మాణ సమయంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ హెచ్చరించారు.

===========

# తెలుగు రాష్ట్రాల్లో పవర్ ఫుల్ లీడర్స్

హైదరాబాద్, ఏప్రిల్ 1,

తెలుగు రాష్ట్రాల నాయకులు మరోసారి తమ సత్తా చాటుకున్నారు. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించారు. ప్రఖ్యాత జాతీయ దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తాజాగా ప్రకటించిన 'ఐఇ 100': 2026 పేరుతో అత్యంత శక్తివంతమైన భారతీయుల జాబితాను ప్రకటించింది. అందులో తెలుగు ప్రముఖులకు చోటు దక్కింది. దేశ గమనాన్ని శాసించగల వందమంది ప్రముఖులతో రూపొందించిన ఈ జాబితాలో తెలుగు నేతలకు అగ్రతాంబూలం దక్కడం విశేషం. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ జాబితాలో ఉన్నారు. అందరికంటే మెరుగైన స్థితిలో ఏపీ సీఎం చంద్రబాబు ఉండడం విశేషం.దేశంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తులను ఈ జాబితాలో చేర్చారు. అందులో ఏపీ సీఎం చంద్రబాబు 13వ స్థానంలో నిలవడం విశేషం. అత్యంత శక్తివంతమైన తెలుగు నాయకుడిగా ఆయన తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం, ఏపీ పునర్నిర్మాణంలో ఆయన చూపుతున్న చొరవ జాతీయ స్థాయిలో సైతం గుర్తింపు పొందింది. ఇక తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారారు సీఎం రేవంత్ రెడ్డి. ఆయన ఈ జాబితాలో 25వ స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ తర్వాత అత్యంత ప్రభావశీలుడైన నేతగా రేవంత్ గుర్తింపు సాధించారు. మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ వంటి సీనియర్లను వెనక్కి నెట్టి రేవంత్ రెడ్డి ఈ జాబితాలో ముందంజలో ఉండడం విశేషం.మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్68వ స్థానంలో నిలిచారు. మరోసారి తన గ్లామర్ ను నిరూపించుకున్నారు. జాతీయస్థాయిలో మంచి నాయకుడిగా గుర్తింపు పొందారు.

కేంద్ర మంత్రి గింజరాపు రామ్మోహన్ నాయుడు సైతం 90 స్థానంలో నిలిచారు. కేంద్ర క్యాబినెట్లో తెలుగు రాష్ట్రాల నుంచి యువనేతగా ఎంపికైన ఆయన మంచి వాగ్దాటితో ముందుకు సాగుతున్నారు. అయితే ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి ఒక్కరంటే ఒక్క నేతకు కూడా ఈ జాబితాలో స్థానం దక్కకపోవడం విశేషం. ఒకప్పుడు అద్భుత విజయంతో జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఇప్పుడు అదే స్థాయిలో ఓటమితో దారుణంగా దెబ్బతిన్నారు రాజకీయంగాను. అయితే ఒక జాతీయ పత్రిక ప్రకటించిన జాబితాలో ఆ రెండు పార్టీలకు ఇప్పుడు చోటు దక్కకపోవడం మాత్రం నిజంగా లోటు

===============

# మళ్లీ వాటర్ వార్...

హైదరాబాద్, కర్నూలు, ఏప్రిల్ 1,

వాటర్ వార్. ఏపీ, తెలంగాణ మధ్య ఇది తెగని పంచాయితీ. ఒడవని లొల్లి. ప్రతీ ఏడాది ఒకటి రెండుసార్లు



అయినా..నీళ్ల రగడ రచ్చ చేయడం కామన్. పైగా శ్రీశైలం డ్యామ్ నీళ్ల వివాదం మాత్రం నెక్స్ట్ లెవల్. రెండు రాష్ట్రాల బార్డర్‌లో ఉన్న శ్రీశైలం డ్యామ్ విషయంలో..ఏదో పేచీ ఉండనే ఉంటుంది. అయితే మీడియా ప్రకటనలు, లేఖలు రాసి నిరసనలు తెలుపుతూ వచ్చిన తెలంగాణ లీడర్లు ఈసారి ఓ అడుగు ముందుకేశారు. ఏకంగా శ్రీశైలం ప్రాజెక్టు మీద ధర్నా చేసేందుకు రెడీ కాగా..ఏపీ సర్కార్ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయడంతో వాటర్ వార్ కాస్త చల్లబడింది. శ్రీశైలం ప్రాజెక్టు వివాదాలకు కేరాఫ్‌గా ఎందుకు మారింది? ఇంత జరుగుతున్న ఐఖీఓః ఎందుకు సైలెంట్‌గా ఉన్నట్లు?ఆంధ్రప్రదేశ్ పర్యాటకంరెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీళ్ల లొల్లి మరోసారి వివాదాన్ని రాజేసింది. కృష్ణా జలాల విషయంలో ఏపీ తీరుపై తెలంగాణ ఎమ్మెల్యేలు కన్నెర్ర చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో వాటర్ డెడ్ స్టోరేజ్ కు పడిపోయినా..ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేయడంపై తెలంగాణ లీడర్లు గుర్రుగా ఉన్నారు. ప్రతీసారి కేంద్రానికి, ఐఖీఓఃకి లేఖల ద్వారా ఫిర్యాదు చేసే తెలంగాణ..ఈ సారి కాస్త సీరియస్‌గా రియాక్ట్ అయింది. ఏపీతో అమీతుమీ తేల్చుకునేందుకు ఏకంగా శ్రీశైలం ప్రాజెక్టు దగ్గర ధర్నా చేసేందుకు రెడీ అయ్యారు నేతలు. లాస్ట్ మినిట్‌లో ఏపీ సర్కార్ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయడంతో..తెలంగాణ నేతలు ధర్నా ఆలోచనను విరమించుకున్నారు.కృష్ణా జలాల విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య ఎప్పటినుంచో వివాదం నడుస్తూనే ఉంది. రాష్ట్ర విభజన నాటి నుంచి వాటర్ వార్ ఇంకో టర్న్ తీసుకుంది. రాష్ట్ర విభజన సందర్భంగా కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు తాత్కాలిక కేటాయింపులు చేశారు. 811 టీఎంసీల నికర జలాలలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చేశారు. 2014లో తాత్కాలిక కేటాయింపులు చేసినా..ఇప్పటికీ అవే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 43 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు మొత్తం 885 అడుగులు ఉంటే..ప్రస్తుతం 824 అడుగులకు నీటిమట్టం పడిపోయింది. ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజ్‌కు పడిపోయింది.డెడ్ స్టోరేజ్‌కు దగ్గరపడితే..సమ్మర్‌లో తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలని..ఉమ్మడి రాష్ట్రంలోనే ఒక నిర్ణయం తీసుకుని దాని ప్రకారమే నడుచుకుంటున్నారు. జీవో కాని ఈ కండీషన్‌ను ఖతం పట్టించి..ఏపీ కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఎడమగట్టు నుంచి తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేసినా..ఏపీ మాత్రం కుడివైపు నుంచి కంటిన్యూ చేస్తోంది. ఇలాగే చేస్తే మునుముందు ఇబ్బందులు తప్పవని..ఉమ్మడి పాలమూరు జిల్లా నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం విద్యుత్‌శాఖను నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..ఏపీ ప్రభుత్వ పెద్దలకు ఫోన్ చేసి చెప్పారు. కానీ ఏపీ అలాగే విద్యుత్ ఉత్పత్తి చేయడంతో.. ఉమ్మడి పాలమూరు నేతలు ఆందోళన బాట పట్టాలని డిసైడ్ అయ్యారు.శ్రీశైలం నుంచి ఏపీ అలాగే విద్యుత్ ఉత్పత్తి చేస్తే..కల్వకుర్తి ఆయకట్టుకు నీరు ఆగిపోయే ప్రమాదం ఉంది. యాసంగి పంట చివరి దశకు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు నీరు ఇవ్వకపోతే..రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కనీసం 15 రోజుల పాటు కల్వకుర్తి ఆయకట్టుకు నీరు అందించాలంటే.. ఏపీ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం తరఫున చేసిన వినతికి ఏ మాత్రం స్పందించకపోవడంతో..ఏకంగా శ్రీశైలం ప్రాజెక్టు దగ్గరే ఆందోళన చేయాలని డిసైడ్ అయ్యారు. ఏకంగా మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డిలు శ్రీశైలం డ్యామ్ మీద ధర్నా చేయాలని నిర్ణయించారు. చివరి నిమిషంలో ఏపీ విద్యుత్ నిలిపేయడంతో ఆందోళనను విరమించుకున్నారు. ఈ పరిస్థితి మరోసారి పునరావృతం అయితే..డ్యామ్ పైన వంటవార్పు చేస్తామని హెచ్చరించారు.అయితే ఏపీ, తెలంగాణ మధ్య నీళ్ల వివాదం ధర్నాలకు వెళ్తున్నా.. వివాదాలను అదుపు చేయాల్సిన కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు సైలెంట్ గా ఉండటం చర్చనీయాంశంగా మారింది. శ్రీశైలం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజ్ కు పడిపోయినా..ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేస్తుంటే ఐఖీఓః చూస్తూ ఉండిపోయిందని తెలంగాణ నేతలు ఫైర్ అవుతున్నారు. అందుకే ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు స్వయంగా రంగంలోకి దిగారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్ విషయంలో కృష్ణా బోర్డు ఇకనైనా నిబంధనలు పాటించేలా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. బోర్డు ఇలాగే మౌనంగా ఉంటే..తమదైన శైలిలో ఆందోళన బాటపడుతామంటూ పాలమూరు జిల్లా నేతలు గట్టి ఇండికేషన్ ఇచ్చారు. ఈ నీళ్ల లొల్లి ఎప్పుడు తెగుతుందో? కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు పంచాయితీని తెంపుతుందో లేదో చూడాలి మరి.

# కవితతో వచ్చేదెవరు...

హైదరాబాద్, ఏప్రిల్ 1,

కవిత కొత్త పార్టీ దాదాపు ఖాయమైపోయింది. ఆమె తన రాజకీయ ప్రయాణాన్ని ఒంటరిగానే మొదలు పెట్టడానికి సిద్ధమయ్యారు. మొదట్లో ఉగాది తర్వాత పార్టీ ఏర్పాటు చేస్తారని ప్రచారం జరిగింది. ఇటీవల ఆమె పార్టీకి సంబంధించిన కొన్ని వ్యవహారాలు లీగల్ ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అయితే ఇప్పుడు ఆ సమస్యలు మొత్తం క్లియర్ కావడంతో రాజకీయ పార్టీ ఏర్పాటుకు కవిత శ్రీకారం చుట్టినట్టు కనిపిస్తోంది. కవిత రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఆమె వెంట ఎవరు వస్తారు.. ఆమెతో ఎవరు ఉంటారు.. ఆమె కోరుకున్నట్టుగా తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో రాజకీయ శున్యత కనిపిస్తోందా.. అనే ప్రశ్నలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. అయితే వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంది. అంతేకాదు.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కేంద్రం స్పష్టం చేసిన నేపథ్యంలో కవిత ఏర్పాటు చేయబోయే పార్టీపై అందరి ఆసక్తి నెలకొంది. కవిత మహిళా రిజర్వేషన్ బిల్లు ఏర్పాటు చేయాలని.. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమాలు చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దీక్షలు కూడా చేశారు. ప్రస్తుతం ఆమె ఏర్పాటు చేయబోయే పార్టీకి అధ్యక్షురాలుగా ఉన్న నేపథ్యంలో.. మహిళలకు ఆమె పెద్దపీట వేసే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే కవిత చేపట్టే ప్రతి ధర్నా.. నిరసన కార్యక్రమంలో ఆడవాళ్లు ఎక్కువగా కనిపిస్తున్నారు. పైగా రాజకీయాల్లోకి ఆడవాళ్లు రావాలని కవిత చాలా సంవత్సరాల నుంచే కోరుతున్నారు. అయితే తన పార్టీ నుంచి ఎక్కువగా ఆడవాళ్లకు అవకాశం కల్పించి.. మహిళా సాధికారతను చేతల్లో చూపిస్తారని తెలుస్తోంది. లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొని.. ఆ తర్వాత కోర్టు ద్వారా ఉపశమనం పొందిన కవిత.. ఇప్పుడు క్లీన్ ఇమేజ్ సాధించారు.



తను మొదటి నుంచి చెబుతున్నట్టుగానే అదంతా కూడా కక్ష సాధింపు చర్య అని జనాలలోకి బలంగా తీసుకెళ్లారు. తద్వారా పులు కడిగిన ముత్యం లాగా తాను బయటికి వచ్చానని కవిత చెబుతున్నారు. అందువల్లే తాను రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. తన మానస పుత్రిక అయిన జాగృతిని పార్టీ పేరులో ఏర్పాటు చేస్తున్న కవిత.. రాజకీయ లక్ష్యాలను బలంగానే నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. కవిత రాజకీయ పార్టీ ఏర్పాటు చేయకముందు సింగరేణి నుంచి కొంతమంది కార్మిక సంఘం నాయకులు ఆమెకు మద్దతు పలికారు. ఆమెతో కలిసి ప్రయాణం చేస్తామని ప్రకటించారు. ఇక ఇటీవల కవిత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించినప్పుడు కొంతమంది నాయకులు ఆమెను కలిశారు. కవిత సపోర్ట్ తో ఇటీవల ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఓ మున్సిపాలిటీని నాయకులు కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత వారు కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. ఇప్పుడు కవితతో ఎవరు వస్తారు.. ఎవరు ఆమెకు అండగా ఉంటారు.. పార్టీ నిర్మాణం.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు.. ఆమెకు అనుకూలిస్తాయా.. అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. మరి వీటికి సమాధానం కవిత ఏ రూపంలో చెప్తారో చూడాల్సి ఉంది.

# టార్గెట్ కౌశిక్ రెడ్డి...బిగుస్తున్న ఉచ్చు

కరీంనగర్, ఏప్రిల్ 1,

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై వివాదాస్పద, మతపరమైన వ్యాఖ్యలు చేసిన కేసులో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 4న విచారణకు రావాలని ఆదేశించింది. ఈ నోటీసులపై స్పందించిన కౌశిక్ రెడ్డి.. ఇది రాజకీయ కక్ష సాధింపు అని తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం సరికాదని రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని.. ప్రజల తరఫున తన పోరాటం ఆపనని ఆయన స్పష్టం చేశారు. హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి చిక్కులు తప్పటం లేదు. ఇప్పటికే అసెంబ్లీలో కడియం శ్రీహరిని బెదిరించారన్న ఆరోపణలతో ఆయనపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. తాజాగా.. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల ఏప్రిల్ 4న హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 29న వీణవంక మండలంలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా బందోబస్తులో ఉన్న పోలీసులకు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు తనను, తన కుటుంబాన్ని జాతర వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి ఆయన మతంపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ క్రమంలోనే సీఐడీ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేసారు. ఏప్రిల్ 4న జరిగే విచారణలో కౌశిక్ రెడ్డి వివరణ తీసుకోనున్నారు. గత కొంతకాలంగా అధికార పక్షంపై నిప్పులు చెరుగుతున్న కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు రావడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. ఇది కక్షపూరిత చర్య అని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని అంటోంది. ఈ నోటీసులపై పాడి కౌశిక్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. ప్రశ్నించే గొంతును అణచలేరని.. ప్రజల కోసం తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఏ తప్పు చేయకపోయినా నోటీసులు పంపారని.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. తాను వెనక్కి తగ్గేది లేదని ట్వీట్ చేశారు. 'ఏ తప్పు చేయకపోయినా ఏదో ఒక విధంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో నాకు, నా కుటుంబానికి, మా ఃఖీా కుటుంబ సభ్యులకు అవిఆ నోటీసులు ఇవ్వడం ఎంతో బాధ కలిగించింది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో నా కుటుంబ సభ్యులను ,మా ఃఖీా కుటుంబ సభ్యులను ఇలా బెదిరింపులకు గురిచేయడం తగునా? రాజకీయాలు నాపై చేయండి.. కానీ నా కుటుంబాన్ని, మా ఃఖీా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం?రేవంత్ రెడ్డి గారు.. నన్ను లక్ష్యంగా చేసుకోండి.. నాపై కేసులు పెట్టండి.. నాకు నోటీసులు ఇవ్వండి.. కానీ నా కుటుంబాన్ని, నా ఃఖీా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం మాత్రం బాధాకరం. అయినా సరే.. నన్ను ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. నేను వెనక్కి తగ్గను. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు.. ప్రజల తరఫున మిమ్మల్ని ప్రశ్నిస్తూనే ఉంటాను. నిలదీస్తూనే ఉంటాను. ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు. ప్రజల కోసం చేసే బాధ్యత. ప్రశ్నించే గొంతును అణచలేరు..ప్రజల కోసం నా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.' అని కౌశిక్ రెడ్డి ట్వీట్ చేశారు.



# అమరావతి రాష్ట్ర ప్రజల శాశ్వత రాజధాని

## దేశం గర్వించే నగరంగా సీఎం చంద్రబాబు తీర్చిదిద్దుతారు

## వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి పెన్షన్ పంపిణీలో ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టంగా కనిపిస్తోంది

### మాజీ మంత్రి దేవినేని ఉమా

విజయవాడ రూరల్ , గొల్లపూడి

రాష్ట్ర ప్రజల శాశ్వత రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని, దాన్ని దేశం గర్వించే నగరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని టిడిపి నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. గొల్లపూడిలో జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ దృష్టి అని పేర్కొన్నారు. అమరావతి రాజధానిపై వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, ఎక్కడికక్కడ దాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. సాగునీటి ప్రాజెక్టుల విషయానికి వస్తే, గతంలో ప్రజలకు నష్టం కలిగించిన వైసీపీకి ఇప్పుడు వాటిపై మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన విమర్శించారు. ఇక సామాజిక సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఉమా స్పష్టం చేశారు. ఎన్నిఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రతి నెల ఒకటో తేదీనే పెన్షన్లు అందజేయడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

# పంచాయితీ రాజ్ శాఖకు అవార్డుల పంట

నెల్లూరు, ఏప్రిల్ 1

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తు?న్న పంచాయతీరాజ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డులు వరించాయి. రెండు విభాగాల్లో తొలిస్థానంలో నిలిచిన ఏపీ పంచాయతీరాజ్ శాఖ.. ఓ విభాగంలో రెండో స్థానంలో.. మరో రెండు విభాగాల్లో తృతీయ స్థానంలో నిలిచి అవార్డులు గెలుచుకుంది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, జల్ సంచయ్ -జన్ భాగీదారీ విభాగాల్లో తొలిస్థానంలో నిలిచింది. మొత్తంగా గతంలో 24వ ప్లేసులో ఏపీ పంచాయతీరాజ్ శాఖ .. నేడు దేశంలోనే తొలి స్థానంలో నిలిచిందిడిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ పంచాయతీరాజ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డులు పంట పండింది. ఏపీ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో రెండు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఒక విభాగంలో ద్వితీయ స్థానంలో నిలవగా., మరో రెండు విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి అవార్డులు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, వివిధ సేవల్లో మెరుగైన పనితీరు ఆధారంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది. రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, జల్ సంచయ్-జన్ భాగీదారి విభాగంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. గత ప్రభుత్వం హయాంలో 24వ స్థానంలో నిలిచిన ఏపీ పంచాయతీరాజ్ శాఖ.. ఈసారి దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం విశేషం. గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించేలా చేయటం, అలాగే ప్రణాళికబద్ధమైన అభివృద్ధి కోసం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. అలాగే జల్ సంచయ్ - జన్ భాగీదారీ కార్యక్రమం కింద తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వచేసే పద్ధతులను ప్రోత్సహిస్తారు. ఈ రెండు విభాగాల్లో దేశంలోనే తొలి స్థానంలో ఏపీ పంచాయతీరాజ్ శాఖ నిలిచింది. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఐదు మంత్రిత్వ శాఖల బాధ్యతలు చూస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ శాఖ, శాస్త్ర సాంకేతికత శాఖలను పవన్ కళ్యాణ్ పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలను పవన్ కళ్యాణ్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా పల్లెపండుగ 1.0, పల్లెపండుగ 2.0 కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఒకేసారి రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. గ్రామసభలలో వచ్చిన వినతుల ఆధారంగా పల్లెవెలుగు కార్యక్రమాలు చేపట్టి రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ అవార్డులు కైవసం చేసుకోవటం విశేషం.

===============

# తెలంగాణలో క్యాన్సర్ డేంజర్ బెల్స్ కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు

హైదరాబాద్, ఏప్రిల్ 1,

తెలంగాణలో క్యాన్సర్ మహమ్మారి చాపకింద నీరులా వేగంగా విస్తరిస్తోంది. క్యాన్సర్ బాధితుల సంఖ్య ప్రతి ఏడాది వేలల్లో పెరుగుతున్నా.. ముందస్తు పరీక్షల పట్ల ప్రజల్లో అవగాహన లోపించడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్-2026 పేరుతో ఐసీఎంఆర్ విడుదల చేసిన తాజా నివేదిక(గ్భ్ర్ర)ంతికర నిజాలను వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయని నివేదికలో తెలిపారు. ప్రతి ఏటా వేల సంఖ్యలో కొత్త కేసులు వెలుగుచూస్తున్నాయని.. అయినా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించే స్క్రీనింగ్ పరీక్షల రేటు మాత్రం అత్యల్పంగా ఉందన్నారు. నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో 30-49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళల్లో కనీసం 4 శాతం మంది కూడా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం లేదు. ఇది వేలాది మంది ప్రాణాలను ముప్పులోకి నెడుతోంది. మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ రేటు కేవలం 0.3 శాతంగానే ఉందని నివేదిక వెల్లడించింది. అలాగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు 3.3 శాతం, నోటి క్యాన్సర్ పరీక్షలు 2.5 శాతం మంది మహిళలు మాత్రమే చేయించుకుంటున్నారు. పురుషుల్లో కేవలం 2.6 శాతం మంది మాత్రమే నోటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. నిమ్స్‌తో పాటు మరో 10 హాస్పిటల్స్ నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. 2026 చివరి నాటికి తెలంగాణలో కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు నమోదవుతాయని అంచనా. ఇందులో పురుషులు 21,252 మంది కాగా.. మహిళలు 25,510 మంది ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య ఏడాదికి 47,314కు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఇక గడిచిన దశాబ్ద కాలంలో క్యాన్సర్ కేసుల సంఖ్య 30 శాతం పెరిగింది. 2015లో 40,177గా ఉన్న కేసులు, 2024 నాటికి 52,334 కు చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మహిళల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 183.8 మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. పురుషుల్లో ఈ రేటు 141.9గా ఉంది. రాష్ట్రంలో నమోదవుతున్న క్యాన్సర్లలో పొగాకు వాడకం వల్ల వచ్చే కేసులే ఎక్కువగా ఉన్నాయి. పురుషుల్లో 58.8 శాతం, మహిళల్లో 29.7 శాతం క్యాన్సర్లు పొగాకు వల్లే వస్తున్నాయి. ముఖ్యంగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. దీనికి తోడు ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు కూడా క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయి. మహిళల్లో పీసీఓడీ, హార్మోన్ల సమస్యలు కూడా క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి. ముందస్తు పరీక్షలు చేయించుకోకపోవడం వల్లే చాలా మంది రోగులు వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రులకు వస్తున్నారని ఓఎపి క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లు పేర్కొంటున్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉన్నప్పటికీ.. ఆలస్యం కావటం వల్ల చికిత్స క్లిష్టతరంగా మారుతోందన్నారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా స్క్రీనింగ్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని.. పొగాకు నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సమ్మర్ కు ముందే పడిపోతున్న భూగర్భ జలాలు

హైదరాబాద్., ఏప్రిల్ 1,

హైదరాబాద్‌లో భూగర్భ జలాలు తగ్గడంతో నీటి ట్యాంకర్ల డిమాండ్ భారీగా పెరిగింది. మార్చిలోనే రోజువారీ ట్యాంకర్ల బుకింగ్స్ 8500 మార్కును చేరగా.. ఏప్రిల్ నాటికి ఇది 10 వేలకు చేరుతుందని జలమండలి అంచనా వేస్తోంది. గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్ వంటి ఐటీ ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్ల ధరలు పెరిగాయి. జలమండలి 1100 ట్యాంకర్లతో సరఫరాను ముమ్మరం చేసినప్పటికీ.. పెరుగుతున్న ఎండల దృష్ట్యా నీటి ఎద్దడి మరింత పెరిగేలా కనిపిస్తోంది. సమ్మర్ వచ్చిందంటే చాలు హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడి మె?దలవుతుంది. ఇది ప్రతి ఏడాది ఉండే తంతే. అయితే ఈసారి కాస్త ముందుగానే నగర ప్రజలకు నీటి కష్టాలు మె?దలయ్యాయి. నగరంలో వేసవి వేడి సెగలు మొదలవకముందే మంచినీళ్ల కష్టాలు ముదిరిపోయాయి. వాతావరణ మార్పులు, అడుగంటిపోతున్న భూగర్భ జలాల కారణంగా నగరవాసులు చుక్క నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెల రోజుల్లోనే నీటి ట్యాంకర్ల డిమాండ్ అనూహ్యంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఫిబ్రవరి చివరలో రోజుకు సగటున 5 వేల ట్యాంకర్ల కంటే తక్కువ డిమాండ్ ఉండగా.. మార్చి నెలాఖరు నాటికి ఆ సంఖ్య 8,500కు చేరుకుంది. ఏప్రిల్ నాటికి ఈ డిమాండ్ రోజుకు 10 వేల ట్యాంకర్లకు చేరుకోవచ్చని జలమండలి అంచనా వేస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరం పశ్చిమ భాగంలోని ఐటీ కారిడార్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, కూకట్‌పల్లి, నిజాంపేట వంటి ప్రాంతాలతో పాటు ఉప్పల్, మల్కాజిగిరి, అమీర్‌పేట ఏరియాల్లో 50 శాతానికి పైగా బోర్లు అడుగంటిపోయాయి. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు ఇప్పుడు పూర్తిగా ట్యాంకర్ల మీదే ఆధారపడుతున్నాయి. హాస్టళ్లు, వాణిజ్య సముదాయాల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో నిత్యం బోర్లపైనే ఆధారపడే వీరంతా ఇప్పుడు నీటి కోసం అల్లాడుతున్నారు. జలమండలి నిబంధనల ప్రకారం 24 గంటలకు ఒకసారి మాత్రమే ట్యాంకర్ బుక్ చేసుకునే అవకాశం ఉండటంతో.. ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు ధరలను భారీగా పెంచేశారు. గతం కంటే ఒక్కో ట్యాంకర్‌పై రూ. 200 నుండి రూ. 500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దూరం, అవసరాన్ని బట్టి రేట్లను ఇష్టానుసారంగా నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా జలమండలికి చెందిన 1,100 ట్యాంకర్లు 140 ఫిల్లింగ్ పాయింట్ల ద్వారా నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవడం సవాలుగా మారింది. ఏప్రిల్, మే నెలల్లో ఈ కష్టాలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, కొందరు ప్రైవేట్ ట్యాంకర్ యజమానులు అనధికారికంగా జలమండలి అధికారిక లోగోను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలా లోగో వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. ఇటీవల కొందరు ప్రైవేట్ బోర్‌వెల్ ట్యాకర్ల ఆపరేటర్లు లోగో, బ్రాండ్‌ను వినియోగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇలా చేయటం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా మోసపూరిత చర్యగా గుర్తిస్తామన్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా భావించి లోగో దుర్వినియోగం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ హెచ్చరించారు.

# కొత్తగూడెం కేంద్రంగా డివిజన్ ...

ఖమ్మం, ఏప్రిల్ 1

కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లకు రాకపోకలు సాగించే రైళ్లకు కూడలిగా మారినందున దాన్ని ప్రధానకేంద్రంగా మార్చాలన్నారు. కొత్తగూడెంకు బ్రిటిష్‌పాలన నుంచి చారిత్రక నేపథ్యం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఇక్కడి నుంచి బొగ్గు రవాణా జరిగేదని.. సింగరేణి కాలరీస్‌కు ఇప్పుడు ఇది ఒక ప్రధాన కేంద్రంగా మారిందన్నారు.గూడ్స్ ట్రైన్ల రవాణా ద్వారా భారతీయ రైల్వేకు అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న ప్రాంతాల్లో కొత్తగూడెం ఒకటి అన్నారు. కొత్తగూడెం-కిరండోల్, మల్కన్‌గిరి-భద్రాచలం, కొత్తగూడెం-సత్తుపల్లి-కొవ్వూరు, జునాగఢ్-మల్కన్‌గిరి-భద్రాచలం లింకులతో ఈ స్టేషన్ నాలుగు రాష్ట్రాల ప్రధాన కూడలిగా మారిందని వెల్లడించారు. 2032 నాటికి వందేళ్లు పూర్తిచేసుకోబోతున్న ఈ స్టేషన్‌కు తగిన గుర్తింపు ఇవ్వాలని స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారని గుర్తు చేశారు. శతవసంతాల గుర్తుగా కొత్తగూడెం కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని ఎంపీలు కేంద్రమంత్రికి సమర్పించిన వినతిపత్రంలో వెల్లడించారు.కాగా, కొత్తగూడెం కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంత సామాజిక, ఆర్థిక ముఖచిత్రం గణనీయంగా మారుతుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉండటం వల్ల పరిపాలనాపరమైన నిర్ణయాల్లో జాప్యం జరుగుతోందని... కొత్తగూడెం కేంద్రంగా డివిజన్ ఏర్పాటైతే ఈ ప్రాంతానికి స్వయంప్రతిపత్తి లభించి, రైల్వే మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమవుతుందని చెబుతున్నారు. సింగరేణి కాలరీస్, కె.టి.పి.ఎస్, ఐటిసి వంటి భారీ పరిశ్రమలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని... బొగ్గు రవాణా ద్వారా రైల్వేకు వచ్చే భారీ ఆదాయం ఇక్కడి అభివృద్ధికి తిరిగి వినియోగించబడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.స్థానిక ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త రైళ్లను ప్రారంభించేందుకు, రైళ్ల సమయాలను క్రమబద్ధీకరించేందుకు వీలవుతుంది. భద్రాచలం వంటి పుణ్యక్షేత్రానికి దేశవ్యాప్త అనుసంధానం పెరుగుతుందని అంటున్నారు. డివిజనల్ కార్యాలయం ఏర్పాటుతో వందలాది మందికి ప్రత్యక్షంగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. స్థానిక వ్యాపారాలు పుంజుకుంటాయని చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ల నిర్మాణం, స్టేషన్ల ఆధునీకరణ పనులు వేగంగా పూర్తవుతాయని.. కొత్తగూడెం రైల్వే డివిజన్ ఏర్పాటు కేవలం రవాణా సౌకర్యమే కాకుండా, వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్‌లా పనిచేస్తుందని అంటున్నారు.

# అజార్‌కు అమాత్య ..

## యోగం ఉన్నట్టా.. లేనట్టా...

ఖమ్మం, ఏప్రిల్ 1,

అజారుద్దీన్ మంత్రి పదవి ఉంటుందా.. ఊడుతుందా.. తెలంగాణ రాజకీయవర్గాల్లో జోరుగా వినిపిస్తున్న చర్చ ఇది. దీనికి కారణం.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఫైల్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉండడమే ! ఏ చట్టసభల్లో సభ్యుడిగా లేకపోయినా.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా అజారుద్దీన్‌ను మంత్రిని చేసింది కాంగ్రెస్ సర్కార్. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ చేస్తూ రేవంత్ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఆ ఫైల్ గవర్నర్ దగ్గరే ఉంది. మంత్రి పదవి కొనసాగాలంటే.. ఆరు నెలల్లోగా శాసనసభ లేదా శాసన మండలిలో అజారుద్దీన్‌కు సభ్యత్వం తప్పనిసరి. ఐతే వచ్చే నెల 30వ తేదీతో.. ఆయన మంత్రి పదవి చేపట్టి ఆరు నెలలు ముగుస్తుంది. ఇంకా 30 రోజులు మాత్రమే టైమ్ ఉండటంతో.. ఇప్పుడేం జరగబోతుందనేది ఆసక్తి రేపుతోంది. గవర్నర్ దగ్గర ఫైల్ ఇలానే పెండింగ్‌లో ఉంటే పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోంది. ఐతే దీనికి రేవంత్ సర్కార్ ప్లాన్ బీ సిద్ధం చేసిందనే టాక్ నడుస్తోంది.అక్టోబర్ 31న తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ రోజు నుంచి 6 నెలల లోపు చట్టసభల్లో సభ్యుడు కావాలి. అంటే ఏప్రిల్ 30లోపు ఆయన చట్టసభల్లో సభ్యుడు కావాలన్న మాట. నాలుగు నెలల కిందటే.. కేబినెట్ ఆమోదించి గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అజారుద్దీన్‌ను నామినేట్ చేసింది. ఐతే బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టులో కేసు వేశారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ ఫైల్‌ను గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. ఈ మధ్యే విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. మరోసారి గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే.. హైకోర్టుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అజారుద్దీన్ మంత్రి పదవి విషయంలో ఏం జరగబోతుందనే ఆసక్తి కనిపిస్తోంది.ఈ మధ్యే రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చారు. దీంతో మరోసారి గవర్నర్‌ను కలిసేందుకు సీఎం రేవంత్ సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది. ఏప్రిల్ మొదటి వారం గవర్నర్‌తో భేటీ అయి.. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరనున్నట్లు సమాచారం. మళ్లీ కోర్టుకు వెళ్తే ఆలస్యం అవడం తప్ప.. వచ్చే లాభం లేదని, వీలైనంత త్వరగా ఫైల్ క్లియర్ చేయాలని గవర్నర్‌ను ప్రభుత్వ పెద్దలు



కోరనున్నారట. ఐతే సాంకేతిక కారణాలతో ఫైల్‌ను గవర్నర్ పెండింగ్‌లో పెడితే మాత్రం.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి గండం తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయ్. దీంతో ప్రభుత్వ పెద్దలు ప్లాన్ ః అమలు చేసేందుకు రెడీ అవుతున్నారట. ఒకవేళ గవర్నర్ నుంచి సానుకూల స్పందన రాకపోతే.. అజారుద్దీన్ చేత రాజీనామా చేయించి.. మే రెండో వారంలో జరిగే కేబినెట్ విస్తరణలో మరోసారి అవకాశం కల్పించాలనే ఆలోచన చేస్తున్నారని టాక్.ఓవరాల్‌గా లాస్ట్ బాల్‌కు అజారుద్దీన్ సిక్స్ కొడతారా.. డకౌట్ అవుతారా అనేది గవర్నర్ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. ఇక అటు త్వరలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయ్. ఇలాంటి సమయంలో అజారుద్దీన్‌కు మంత్రి పదవి దూరం అయితే.. కాంగ్రెస్‌కు సమస్యగా మారే అవకాశం ఉంటుంది. దీంతో ఈ విషయంపై రేవంత్ సర్కార్ సీరియస్‌గా ఉంది. గవర్నర్ నిర్ణయం సానుకూలంగా లేకపోతే? ప్లాన్ ః అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది

# నెల్లూరు సిటీలో అభివృద్ధి జాతర.

## అభివృద్ధి పనులకు మంత్రి నారాయణ శ్రీకారం
## అత్యాధునిక మార్కెట్ నిర్మాణానికి మంత్రి ఆదేశం.
## గత పాలకుల విధ్వంసం నుంచి పూర్వ వైభవానికి రాష్ట్రం
## -మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు.

జగన్ ప్రభుత్వం ఐదేళ్ల అస్తవ్యస్త పాలనతో రాష్టాన్ని అధోగతి పాలు చేసి వెళ్లిందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ చిన్నాభిన్నం చేసిన వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారన్నారు .మంత్రి నారాయణ ఆధ్వర్యంలో నగర నియోజకవర్గంలో అభివృద్ధి జాతర కొనసాగుతోంది .అందులో భాగంగా బుధవారం 15వ డివిజన్ బాలాజీనగర్ ఉగాది సెంటర్లో 30 లక్షలతో డ్రైన్ల నిర్మాణానికి, అలాగే 46వ డివిజన్ రాధామాధవ్ సందులో 28 లక్షలతో సి.సి. రోడ్డు డ్రైన్ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం ట్రంక్ రోడ్డులో పర్యటించి దుకాణదారులతో ముచ్చటించారు.9వ డివిజన్‌లోని మార్కెట్ యార్డ్ స్థలాన్ని పరిశీలించి, అక్కడ అత్యాధునిక హంగులతో నూతన మార్కెట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమవే రెండు కళ్లుగా కూటమి పాలన సాగుతోందన్నారు.గత ప్రభుత్వం వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి కేంద్ర నిధులను దారి మళ్లించిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పరిపాలనా అనుభవంతో దేశంలనే 25 శాతం పెట్టుబడులను రాష్ట్రానికి రాబట్టారన్నారు.పరిశ్రమల స్థాపనతో ఉపాధి పెంచి రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు.ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్ ,మేయర్ సుజాతా అశోక్ ,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ,మాజీ మున్సిపల్ చైర్పెర్సన్ తాళ్ళపాక అనూరాధ ,కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు

,కర్తం ప్రతాప్ రెడ్డి ,క్లస్టర్లు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ,బాలాజీ ,కో క్లస్టర్లు అంచూరు శ్రీనివాసులు ,పుట్టా అజయ్ ,డివిజన్ ప్రెసిడెంట్లు పెంచల్ చౌదరి ,మహేంద్ర ,పాకాల పెంచలయ్య ,టీడీపీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి తదితరులు పాల్గొన్నారు .


# పాతబస్తీలో హైడ్రా భారీ ఆపరేషన్

## క్రీడామైదానంలో అక్రమ కట్టడాల తొలగింపు

### 5 నిర్మాణదశలో ఉన్న భవనాల కూల్చివేత
### రూ. 100 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్, ఏప్రిల్ 01:

పాతబస్తీ మైలర్దేవుపల్లిలో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. 6500 గజాల క్రీడమైదానాన్ని కాపాడింది. దీని



విలువ రూ. 100 కోట్లవరకు వుంటుందని అంచనా. హెచ్ఎండియే అనుమతి పొందిన లేఔట్లో స్పష్టంగా క్రీడామైదానం అని పేర్కొన్నా ఆక్రమణలకు తెగబడిన వారికి కూల్చివేతలతో బుద్ధి చెప్పింది.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలార్దేవుపల్లి విలేజ్ శాస్త్రిపురం కాలనీలో హైడ్రా బుధవారం భారీ ఆపరేషన్ నిర్వహించింది. 188 ఎకరాల హుడా అనుమతి పొందిన లేఔట్లో క్రీడాస్థలం కోసం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది. జీ ప్లస్ 3 అంతస్తుల నిర్మాణ దశలో ఉన్న భవనాలు ఐదింటిని హైడ్రా తొలగించింది. మరో రెండు సింగిల్ రూమ్ నిర్మాణాలను తొలగించింది. 1800 ల ప్లాట్లకు పైగా ఉన్న ఈ లేఔట్ ప్రకారం 6500 గజాల స్థలాన్ని ప్లే గ్రౌండ్ కోసం కేటాయించారు. క్రీడస్థలానికి కేటాయించిన స్థలం అని తెలిసి కూడా గత 3 సంవత్సరాలుగా నోటరీ మీద స్థానికంగా ఉన్న కబ్జాదారులు ప్లాట్లుగా అమ్మేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. జీహెచ్ఎంసి గతంలో నోటీసులు కూడా ఇచ్చింది. 2024లో కూల్చివేతలు చేస్తామని ఆర్డర్లు కూడా జారీ చేసింది. అయినా పట్టించుకోకుండా అక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయి. యిదే విషయమై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు జీహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. లేఔట్ ప్రకారం క్రీడాస్థలం కోసం కేటాయించిందని నిర్ధారణ చేసుకుంది. నిర్మాణాలు చేపట్టవద్దని వెంటనే హైడ్రా హెచ్చరించింది. బుధవారం ఉదయం ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 5 నిర్మాణంలో ఉన్న భావనలతో పాటు రెండు చిన్న గదులతో నిర్మించిన వాటిని తొలగించింది. ఇంకో రెండు భవనాల్లో ఇప్పటికే నివాసాలు ఉండడంతో వాటిని మినహాయించింది. క్రీడామైదానం అందుబాటులోకి రావడంతో శాస్త్రిపురం కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆక్రమణలు అడ్డుకుంటే భయపెట్టారని.. హైడ్రా రావడంతో క్రీడాస్థలం కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటం ఫలించిందని సంతోషం వ్యక్తం చేశారు ఇక్కడ కబ్జా చేసిన వాళు ,, సామాన్యులు కాదని.. అడ్డుకున్నవాళ్లను బెదిరించారని తెలిపారు.

# శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం

## -నేడు హనుమాన్ జన్మోత్సవం
## -అందరికీ హనుమాన్ జన్మోత్సవ శుభాకాంక్షలు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

హనుమంతుని జయంతిని చైత్ర శుద్ధ పౌర్ణమి నాడు జరుపుకుంటారు. ఈ రోజున హనుమాన్ భక్తులు రోజంతా ఉపవాసముండి, హనుమన్ చాలిసా పఠనం, రామనామ జపం చేస్తారు. హనుమంతుని జన్మవృత్తాంతం శివమహాపురాణం, రామాయణం, పరాశిర సంహిత మొదలైన గ్రంథాలలో అనేకానేక



గాధలతో వివరించబడి వుంది .హిందూ పురాణ కథల ప్రకారం పుంజికస్థల అనే అప్సరస అంజన అనే వానర కాంతగా జన్మించెను. కేసరి అనే వానరవీరుడు ఆమెను పెళ్ళాడెను. వారు సంతానము కొరకు భక్తితో శివుని ఆరాధించిరి. అప్పుడు వాయుదేవుడు శివుని తేజమును పండు రూపములో అంజనకొసగెను. అంజనకు జన్మించిన సుతుడే

ఆంజనేయుడు. కేసరి నందనుడనీ, వాయుదేవుని అనుగ్రహముతో జన్మించినందున వాయుసుతుడనీ కూడా అంటారు.ఈ పండుగ ద్వైత సంప్రదాయము ననుసరించి మాధ్యులకు ప్రధానమైనది. వారు హనుమంతుని 'ముఖ్య ప్రాణ దేవరు' అని పిలుస్తారు. హనుమంతుని ఉపాసకులు కూడా ఈ పండుగ జరుపుకుంటారు. శ్రీరామనవమితో పాటు కొందరు ఈ జయంతి జరుపుటను కూడా ఉంది.పరాశర సంహిత అనే గ్రంథం ప్రకారం ఆంజనేయుడు వైశాఖ బహుళ దశమి, శనివారం జన్మించారని తెలిపారు. అదే రోజున కొంతమంది హనుమజ్జయంతి జరుపుకుంటారు అయితే కొన్ని ఐతిహ్యాల ప్రకారం చైత్ర పౌర్ణమి నాడు నికుంభుడు తదిరత

రాక్షసులను సంహరించి హనుమంతుడు విజయం సాధించినట్లు కనిపిస్తుంది. ఈ కారణంగా ఆ రోజు హనుమద్ విజయోత్సవం చేసుకునే సంప్రదాయం కొన్ని చోట్ల ఉంది. దీన్ని ఉత్తరాదిలో హనుమజ్జయంతిగా చేసుకుంటారుజన్మ వృత్తాంతము:ఒకసారి దేవలోకమందు దేవేంద్రుడు కొలువుతీరి యున్న సమయాన పుంజికస్థల అను అప్సరసకాంత బృహస్పతి వద్దకు చేరి హాస్య ప్రసంగము చేయసాగిందట, ఆమె యొక్క హావభావ వికారాలకు బృహస్పతి మిక్కిలి ఆగ్రహించి నీవు భూలోకమందు ''వానరస్త్రీ'' గా జన్మింతువుగాక! అని శాపము పెట్టినాడు. అంత ఆ పుంజికస్థల తన తప్పిదాన్ని మన్నించి శాపవిమోచనవి వాయమని పరివరి విధముల ప్రార్థించింది. దానికి బృహస్పతి సంతసించి నీవు భూలోకమందు ''హనుమంతునికి'' జన్మ ఇచ్చిన తరువాత తిరిగి దేవలోకమునకు రాగలవని అనుగ్రహించెను. ఇది కంబరామాయణ గాధలో గల వృత్తాంతము. ఆ శాపకారణంగా ''పుంజికస్థల'' భూలోకమందు వానరకన్యగా జన్మించి "కేసరి" అను అందమైన వానరాన్ని ప్రేమించి వివాహమాడింది. అంత ఆమె గర్భముదాల్చి శివాంశ సంభూతుడైన ''శ్రీ ఆంజనేయస్వామి'' కి జన్మ ఇచ్చింది.మనోజవం మారుతతుల్య వేగం జితేంద్రియంబుద్ధి మతాంవరిష్టం।

వాతాత్మజం వానరయూథ ముఖ్యంశ్రీరామ దూతం శరణం ప్రపద్యే॥

భావము:- మనస్సుని జయించినవాడు, గాలి వేగంతో పయనించేవాడు, పంచేంద్రియాలను తన అధీనంలో ఉంచుకున్నవాడు,గొప్ప తెలివిగలిగినవాడు, వానరులలో ముఖ్యుడు, శ్రీ రామచంద్రునకు దూత అయిన హనుమంతునికి ప్రణామం చేస్తున్నాను.ఆంజనేయస్వామికి 41 రోజులు నియమంగా ఆరాధన చేయాలి. గుడి దగ్గర ఉన్న రావి చెట్టుకు "11" ప్రదక్షిణలు నిదానంగా తిరుగుతూ 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అంటూ స్మరించుకోవాలి. స్త్రీలు మధ్యలో విరామం ఇచ్చి తిరిగి ప్రారంభించి 41 రోజులు పూర్తి చేయవచ్చు. ప్రమిద భూమిపై పెట్టకుండా రావి ఆకు వేసి దానిపై పిండితో తయారు చేసిన దీపాన్నిపెట్టి కుంకుమ, పూలతో

అలంకరించి వెలిగించాలి. ఇందులో సూచించినట్లుగా పిండితో చేసిన ప్రమిదలో కొంచం బెల్లం వేసి దానిపై వత్తి వేసి నునే పోసి పూజ చేయాల్సి ఉంటుంది.

# రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం

వైఎస్సార్ కడప,ఏప్రిల్ 01(భారత శక్తి ) :



ఒంటిమిట్ట శ్రీ కోదండ రాముని కళ్యాణ మహోత్సవ కార్యక్రమం లో పాల్గొనేందుకు బుధవారం ఒంటిమిట్ట హెలిప్యాడ్ కు సాయంత్రం 5.10 గంటలకు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు ఘన స్వాగతం లభించింది.

రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,అదనపు ఈఓ సి హెచ్ వెంకయ్య చౌదరి,జె ఈ ఓ శరత్,

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, లు ముఖ్యమంత్రికి పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు.

వీరితో పాటుప్రభుత్వ విప్ మరియు కడప శాసన సభ్యురాలు ఆర్ .మాధవి రెడ్డి,ప్రొద్దుటూరు, కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు వరద రాజుల రెడ్డి,పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి,పుట్టా సుధాకర్ యాదవ్, జేసి డా.నిధి మీనా,రాజం పేట సబ్ కలెక్టర్ భావన,డి సి సి బి చైర్మన్ సూర్య నారాయణ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రెసిడెంట్ మరియు పోలిట్ బ్యూరో మెంబర్ ఆర్. శ్రీనివాసుల రెడ్డి,తెలుగుదేశం పార్టీ పులివెందుల ఇంచార్జ్ ఎం. రవీంద్రనాథ్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ కడప జిల్లా అధ్యక్షులు సీ. భూపేష్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాజంపేట ఇంచార్జ్ సీ.జగన్మోహన్ రాజు తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో వున్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆప్యాయంగా అందరిని పేరుపేరున పలకరించారు. అనంతరం టిటిడి అతిధి గృహం నకు రోడ్డు మార్గాన బయలు దేరి వెళ్లారు.

రోడ్డు మార్గాన వెళ్తున్న సమయంలో ముఖ్యమంత్రి ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. సా.5.20 గం.లకు టిటిడి అతిధి గృహమునకు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు, టిటిడి బోర్డు సభ్యులు స్వాగతం పలికారు.

# ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 01(భారత శక్తి) ఈనెల నాలుగవ తేదీన (శనివారం) ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు.



మంగళవారం ఆయన, ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికైన కౌన్సిలర్లకు పార్టీల వారిగా సీటింగ్ ఏర్పాటు చేసి, త్రాగునీరు అందించాలని పేర్కొన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టి, తొలిసారి ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చినందున అదనపు కలెక్టర్ ను, మున్సిపల్ కమిషనర్, తదితర అధికారులు శాలువాతో సన్మానించారు.

ఈ సమావేశంలో సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మైత్రి వెంకటరెడ్డిని ఘనంగా సన్మానించిన రెడ్డి సంక్షేమ సమైక్య సంఘం

మణుగూరు, ఏప్రిల్ 01(భారత శక్తి ): రెడ్డి సంక్షేమ సమైక్య మణుగూరు అధ్యక్షుడు నాసిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి అశోక్ నగర్ లో గల కార్యాలయంలో సాని కొమ్ము వెంకటరెడ్డి (మైత్రి)ని బుధవారం ఘనంగా సన్మానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైనా సంధర్భంగా రెడ్డి సంక్షేమ సమైక్య మణుగూరు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరంవిజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రైస్ మిల్లర్ అసోసియేషన్ తో పాటు మరిన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాక్షించారు ఈ కార్యాక్రమంలో సామ శ్రీనివాస రెడ్డి, ఉడుముల తిరుపతిరెడ్డి, సాని కొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి, కీసర శ్రీనివాసరెడ్డి, గుర్రం వెంకటరెడ్డి, శీరపు గణేష్ రెడ్డి, సామ శ్రీనివాస రెడ్డి (రైస్ మిల్), గ్యాస్ కొండారెడ్డి, గాయం అవినాష్ రెడ్డి, బంకు శ్రీనివాసరెడ్డి, రెడం శివశంకర్



రెడ్డి, శ్యామల అశోక్ రెడ్డి, దేవి రెడ్డి ఆది రెడ్డి, సారంపెల్లి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక యంత్రాలతో వ్యవసాయ పనులు సులువు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 01(భారత శక్తి): వ్యవసాయ పనుల్లో ఆధునిక యంత్రాల వాడకం వల్ల వ్యవసాయ పనులు సులభతరం అవుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో, సారంగాపూర్ మండలం కౌట్ల (బి) రైతు సంఘానికి 3 లక్షల 85 వేల సబ్సిడీతో మంజూరైన డ్రోన్, పనిముట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ పనుల్లో ఆధునిక వ్యవసాయ పనిముట్లు భాగస్వామ్యం చేయడం వల్ల రైతులు ఎంతో లాభం పొందుతారని, పనులు అన్ని తక్కువ కాలంలో, తక్కువ శ్రమతో పూర్తవుతాయని పేర్కొన్నారు. దీనివల్ల రైతుకు సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. మరింతమంది రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, రైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సాగాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 01(భారత శక్తి):జిల్లాలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్దేశిత ప్రణాళిక ప్రకారం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలో కొనసాగుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రేపటి రోజున గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గ్రామ, వార్డు సభలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ గ్రామ సభల్లో భాగంగా, ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. వివిధ పథకాల రూపాలలో లబ్ధి పొందిన వారి వివరాలు వెల్లడించాలని చెప్పారు. గ్రామ సభలకు హాజరయ్యే వారికి అవసరమగు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున నిర్ణీత సమయంలో గ్రామ సభలను ముగించాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మహిళా సంఘాలకు అవార్డులు లభించడం గర్వకారణం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



నిర్మల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 01(భారత శక్తి):జిల్లా మహిళా సంఘాలకు ఇటీవలి రాష్ట్ర స్థాయి అవార్డులు లభించినందుకు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ను ఆ శాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను, సిబ్బందిని శాలువాలతో సన్మానించి, అభినందించారు. అధికారులు, సిబ్బంది చేసిన కృషి గొప్పదని హర్షం వ్యక్తం చేశారు. మున్ముందు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ, జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడపాలని అన్నారు.

అవార్డులు సాధించేలా ప్రోత్సహించినందుకు కలెక్టర్ కు అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో త్రాగు నీటి సమస్యలు రాకుండా చూడాలి : మంత్రి సీతక్క.

ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 01 (భారత శక్తి): వేసవి కాలం లో త్రాగు, సాగు నీటికీ ఎద్దడి తలెత్తకుండా జిల్లాలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి త్రాగు, సాగు నీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లా ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, గుత్తికోయ ప్రాంతాలలో ప్రత్యేక ప్రణాళికల చేతి పంపు, ట్రాక్టర్ ట్యాంక్ ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. యుద్ధ ప్రతిపాదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా అధికారులు చూడాలని లబ్ధిదారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకొని నిర్మాణాలలో వేగం పెంచేలా చూడాలని, మంజూరు అయిన ఇండ్ల లబ్ధిదారులు ఇప్పటివరకు గ్రౌండింగ్ చేయకపోతే దానికి గల కారణాలు సేకరించి లబ్ధిదారులు మహిళ సంఘం లో ఉంటే వారికి వెంటనే లక్ష రూపాయల రుణం అదే విధంగా చూడాలని అన్నారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా 200 కోట్ల రూపాయల నిధులతో గోదావరి జలాలను జిల్లాకు మళ్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, గ్రామ పంచాయితీలకు మంజూరు చేసిన నిధులను నియమ నిబంధనల ప్రకారం మాత్రమే ఉపయోగించుకోవాలని ఎట్టి పరిస్థితుల్లో ప్రజాధనాన్ని వృధా కాకుండా చూసుకోవాలని సూచించారు. చిన్న అభివృద్ధి పనుల ద్వారా ప్రజలకు పెద్ద మొత్తంలో ప్రయోజనాలు చేకూరుతాయని, జిల్లా అభివృద్ధి కోసం మెరుగైన ప్రణాళికలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీవో వెంకటేష్, ఆర్ డబ్ల్యూ ఎస్ సి ఈ సురేష్, ఈ ఈ మాణిక్య రావు, ఇర్రిగేషన్ ఈ ఈ నారాయణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నాకు వయసుతో పాటే బైకులపై ఆసక్తి పెరుగుతూ వచ్చింది: రాజశేఖర్

- నాకు తెలియకుండా నా బైక్‌ను జీవిత అమ్మేసిందన్న రాజశేఖర్
- 'బైకర్' సినిమా ప్రచార కార్యక్రమంలో పాత జ్ఞాపకాలు వెల్లడి
- రిస్క్‌తో నడుపుతున్నాననే భయంతోనే జీవిత అలా చేసిందని వివరణ
- 'శేషు' సినిమా సమయంలో యమహా 650 బైక్ కొన్నానన్న రాజశేఖర్



సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్, తన భార్య జీవిత గురించి ఓ సరదా విషయాన్ని మీడియా ముందు పంచుకున్నారు. తనకు ఎంతో ఇష్టమైన బైక్‌ను, తనకు తెలియకుండానే జీవిత అమ్మేశారని ఆయన నవ్వుతూ చెప్పారు. శర్వానంద్ హీరోగా నటిస్తున్న 'బైకర్' సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా నిన్న హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఈ ఆసక్తికర సంఘటనను ఆయన వెల్లడించారు. బైక్స్ అంటే తనకెంత ఇష్టమో వివరిస్తూ, చిన్నప్పటి నుంచి తనకు బైక్స్ అంటే చాలా ఇష్టమని, అమ్మమ్మగారింట్లో బుల్లెట్‌పై ఊరంతా తిరిగేవాడినని ఆయన గుర్తుచేసుకున్నారు. తనకు వయసుతో పాటు బైకులపై కూడా ఆసక్తి పెరుగుతూ వచ్చిందన్నారు. ఆ క్రమంలోనే శేషు సినిమా సమయంలో షూటింగ్ కోసం తాను స్వయంగా యమహా 650 బైక్‌ను కొనుగోలు చేశానని. ఆ తర్వాత కూడా దాన్నే కొన్నాళ్లు నడిపానని చెప్పారు. అయితే, నేను నడిపే విధానం చూసి జీవిత ఆందోళన చెందిందన్నారు. స్పీడ్‌గా డ్రైవ్ చేస్తున్నానని భయపడి తనకు తెలియకుండా జీవిత బైక్ అమ్మేసిందని నవ్వుతూ చెప్పారు. కాగా, ఏప్రిల్ 3న విడుదల కానున్న 'బైకర్' చిత్రంలో రాజశేఖర్ 'బుల్లెట్ సునీల్' అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ చిత్రంగా ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమాతో పాటు, తాను 'మగాడు' అనే మరో చిత్రంలో నటిస్తున్నానని, అలాగే తన కుమార్తె శివానితో కలిసి ఓ సినిమాలో కనిపించనున్నట్లు రాజశేఖర్ తెలిపారు.

## సినిమా

# నిజం జీవితంలో నటించలేను



చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరియర్ స్టార్ట్ చేసిన రాశి స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. పవన్ కల్యాణ్, మహేష్ బాబు, జగపతిబాబు, శ్రీకాంత్ ఇలా స్టార్ హీరోలతో సినిమాలు చేసింది. దాదాపు 300పైగా సినిమాల్లో నటించింది. బుల్లితెరపై జానకి కలగనలేదు సీరియల్‌తో క్రేజ్ దక్కించుకుంది. అసోసియేట్ డైరెక్టర్ నివాస్ అలియాస్ శ్రీనివాస్‌ను పెండ్లి చేసుకున్న నటి తమ 21 ఏండ్ల వివాహ బంధం గురించి పలు విషయాలు వెల్లడించింది. ఇంట్లో ప్రొఫెషనల్ విషయాల గురించి ఒక్క మాట మాట్లాడుకోరట. ఎవరి పని వారిదట. ఏదైనా ముఖ్య విషయాలు ఉంటే మాత్రం షేర్‌చేసుకుంటారట. ఇంట్లో తాను భార్యగా.. ఆయన భర్తగా ఉంటామని పేర్కొంది. భర్తను ముద్దుగా శ్రీను అని పిలుస్తుందట. కామన్‌గానైతే ఒరేయ్ అని పిలుచుకుంటారట. తనకు ఏవండీ నివాస్ గారూ.. డైరెక్టర్ గారూ అని యాక్ట్ చేయడం రాదని చెప్పింది. కెమెరా ముందు మాత్రమే యాక్ట్ చేస్తానని, నిజం జీవితంలో నటించలేనని స్పష్టం చేసింది.

# ఆ పాత్ర పోషించడం నా అదృష్టం



దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం రామాయణ. రెండు పార్టులుగా రాబోతున్న ఈ చిత్రంలోని తొలి భాగం 2026 దీపావళి కానుకగా విడుదల కానుంది. అయితే ఇటీవల అమెరికాలోని లాస్ ఏంజిల్స్ ఐమ్యాక్స్ థియేటర్‌లో ఓ స్పెషల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. దీనిలో భాగంగా హీరో రణ్‌బీర్ కపూర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. రాముడు అంటే కేవలం ఒక పాత్ర కాదు.. ఆయన కోట్లాది మందికి ఆత్మసాక్షి. కరుణ, ధైర్యం, ధర్మాలకు ప్రతీక అయిన పురుషోత్తముడి పాత్రను పోషించడం నా అదృష్టంగా భావిస్తున్నాను అంటూ రణ్‌బీర్ ఎమోషనల్ అయ్యారు. ఇందులో రాముడిగా రణ్‌బీర్ ప్రశాంతమైన లుక్‌లో కనిపిస్తుండగా, సాయి పల్లవి (సీత), సన్నీ డియోల్ (హనుమంతుడు), రవి దూబే (లక్ష్మణుడు) వంటి పాత్రలు పోషిస్తున్నారు. రావణుడిగా కన్నడ స్టార్ యష్ అగ్నిపర్వతంలాంటి రౌద్ర రూపంలో మెప్పించబోతున్నారు.

# క్రియేటివిటీకి ఫిదా



సోషల్‌మీడియాలో క్రియేటివిటీకి కొదవే లేదన్నట్లుగా మారిపోయింది. చాలామంది తమ టాలెంట్ తో సెలబ్రిటీలను సైతం మెప్పిస్తున్నారు. తాజాగా ఓ మహిళా టైలర్ ఎడిటింగ్ టాలెంట్ చూసి సినీ హీరోయిన్ సమంత ఆశ్చర్య పోయింది. యాంకర్ సుమ తో సమంత మాట్లాడిన పాత వీడియో కాల్ క్లిప్ ను వాడుకుని, హీరోయిన్ నేరుగా తనతోనే మాట్లాడుతున్నట్లుగా మహిళ అద్భుతంగా ఎడిట్ చేసింది. ఈ క్రియేటివిటీకి ఫిదా అయిన సమంత.. ఆ మహిళ ప్రతిభను మెచ్చుకుంది. ఈమేరకు ఆ వీడియోను సామ్ తన ఇన్‌స్టాలో స్టోరీలో షేర్ చేసింది. ఇక సినిమాల విషయానికొస్తే.. సమంత నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తికాగా.. ప్రస్తుతం డబ్బింగ్ పనులు మొదలయ్యాయి. ఇకఈ చిత్రాన్ని మే 15న థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

### తెలంగాణ నేపథ్య కథతో

# సుకుమార్ నిర్మాణంలో సినిమా



గత కొంతకాలంగా తెలుగు సినిమాల్లో తెలంగాణ నేపథ్య కథలను తరచుగా చూస్తున్నాం. తెలంగాణ మట్టికథలు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రధాన కథావస్తువుగా తీసుకుని దర్శకులు భావోద్వేగ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. 'బలగం' ఈ కోవలోనే ఎలాంటి విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆ చిత్రాన్ని తెలంగాణలోని ప్రతి పల్లెలో తెరలు కట్టుకుని చూస్తూ ఎమోషనల్ అయ్యారు. 'బలగం' తరువాత తెలంగాణ నేపథ్య కథలతో సినిమాలు తెరకెక్కించడానికి దర్శక, నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఇక త్వరలో మరో తెలంగాణ నేపథ్య కథతో సినిమా సెట్స్ మీదకు వెళ్లడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ దర్శకుడు సుకుమార్ తన సొంత నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ సంస్థపై చిత్రాలు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సుకుమార్ రైటింగ్స్ సంస్థ నాగచైతన్య హీరోగా నటిస్తున్న వృషకర్మ, రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రాలకు నిర్మాణ భాగస్వామిగా ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా సుకుమార్, నిర్మాత బన్నీవాస్‌లు సంయుక్తంగా ఓ చిత్రాన్ని నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నారు. 'బలగం' ఫేమ్ ప్రియదర్శి హీరోగా నటించనున్న ఈ చిత్రం తెలంగాణ నేపథ్య కథతో రూపొందనుందని సమాచారం. ఈ చిత్రం ద్వారా ఓ నూతన దర్శకుడు పరిచయం కాబోతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. దర్శకుడిగా స్టార్స్‌తో పాన్ ఇండియా చిత్రాలు తెరకెక్కిస్తున్న దర్శకుడు సుకుమార్, నిర్మాతగా కూడా ఇలాంటి కథలతో చిన్న సినిమాలు నిర్మించడం నిజంగా ప్రశంసనీయం.

### స్వర్ణ దేవాలయంలో ప్రియాంక చోప్రా..

# గిన్నెలు కడుగుతూ సేవ!



స్టార్ హీరోయిన ప్రియాంక చోప్రా చాలా కాలం తర్వాత భారత్‌లో అడుగుపెట్టారు. ప్రస్తుతం ఆమె పర్యటనకు సంబంధించిన వార్తలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా అమృత్‌సర్‌లోని ప్రఖ్యాత స్వర్ణ దేవాలయాన్ని (గోల్డెన్ టెంపుల్) సందర్శించుకున్న ప్రియాంక, అక్కడ ఆధ్యాత్మిక సేవలో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించారు. గుడి ప్రాంగణంలో ఆమె స్వయంగా గిన్నెలు శుభ్రం చేస్తూ కనిపించారు. ఈ అరుదైన దృశ్యానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. నిన్న మహావీర్ జయంతి సందర్భంగా ప్రియాంక స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. గులాబీ రంగు దుస్తులు ధరించి, తలపై దుపట్టా కప్పుకుని ఆమె ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సిక్కు మతంలో ఎంతో పవిత్రంగా భావించే 'సేవ'లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఉపయోగించే పాత్రలను ఆమె శ్రద్ధగా శుభ్రం చేశారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా ఒక సామాన్య భక్తురాలిగా ఆమె సేవలో నిమగ్నమవడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. అయితే, ప్రియాంక భారత్ పర్యటన వెనుక అసలు కారణం ఏమిటనే దానిపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఆమె తన సినిమా షూటింగ్ కోసమే ఇక్కడికి వచ్చారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న 'వారణాసి' అనే చిత్రంలో ప్రియాంక నటిస్తున్న విషయం తెలిసిందే.

### ముంబై బంగ్లాను లీజుకిచ్చిన సారా..

# పదేళ్లకు రూ. 4 కోట్లకు పైగా డీల్

బాలీవుడ్ యువ నటి సారా అలీ ఖాన్ ముంబైలోని తన ఆస్తిని లీజుకు ఇచ్చి భారీ ఆదాయం పొందనున్న సెలబ్రిటీల జాబితాలో చేరారు. అంధేరీ వెస్ట్‌లోని తన బంగ్లాను ఐదేళ్ల కాలానికి గాను రూ. 4.14 కోట్లకు ఒక ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చారు. ప్రోడిజీ మాంటిస్సోరి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఈ ప్రాంగణాన్ని పాఠశాల కార్యకలాపాల కోసం ఉపయోగించుకోనుంది. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం, ఈ ఒప్పందం వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. లీజు కాలం మే 1, 2026 నుంచి ప్రారంభమవుతుంది. మొదటి రెండేళ్ల పాటు నెలవారీ అద్దె రూ. 6.5 లక్షలుగా నిర్ణయించారు. మూడో ఏడాది నుంచి అద్దెపై 5 శాతం పెరుగుదల ఉంటుంది.

# వైభవంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



* ఉత్సవ మూర్తులకు ప్రత్యేక కలశ పూజలు
* అయ్యప్పస్వామికి అభిషేకం, హోమం
* అయ్యప్ప పీఠాల గురుస్వాములు, భక్తుల ఆధ్వర్యంలో అన్నప్రసాదం
* 3వేల మందికి పైగా అన్నప్రసాద వితరణ
* అయ్యప్ప శరణుఘోషతో మారుమ్రోగిన ప్రాంగణం,
* భక్తి శ్రద్ధలతో మణికంఠుడిని దర్శించుకొని పులకించిన భక్తజనం

మణుగూరు, ఏప్రిల్ 01 (భారతశక్తి): "శరణ్యాయ హరిహరసుతాయ స్వామినే పదద్వంద్వయుగే నిత్యం నమో ధర్మశాస్త్రయే। కలౌ యుగే క్షేమకరాయ విఘ్నహర్తే స్వామి శరణం అయ్యప్పా!" అంటే హరిహరసుతుడైన అయ్యప్ప స్వామికి నేను శరణాగతుడను. అయ్యప్ప స్వామి యొక్క దివ్య పాదయుగాలకు నేను ఎల్లప్పుడూ వందనం చేస్తున్నాను. కలియుగంలో భక్తులకు క్షేమాన్ని అందించే, విఘ్నాలను తొలగించే ధర్మశాస్త్రునికి నా నమస్కారాలు. "స్వామి శరణం అయ్యప్పా" అని హృదయపూర్వకంగా శరణం కోరుతున్నాను. అని అర్థం. అలాంటి లోక రక్షకుడు శ్రీ మణికంఠ స్వామి చైత్ర మాస ఉత్తరా నక్షత్రం జన్మదిన వేడుకలను మండలంలోని అయ్యప్ప పీఠాల గురుస్వాములు, భక్త జనుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన వేదికలో ఉదయం నుంచి అర్చకులు ఉప్పల శ్రీకర్, అద్వైత్ శర్మలు శ్రీ ధర్మశాస్త్రా యైన అయ్యప్పస్వామికి ప్రత్యేక



కలశ పూజలు, విగ్రహానికి అష్ట దశ ద్రవ్యాలతో అభిషేకాలు, అష్ట దిక్పాలకులు లోకాన్ని రక్షించే దేవతల మంత్రోచ్చారణతో హోమం జరిపించారు. ముందుగా అర్చకులు గణపతి మంత్రోచ్చరణతో ఉత్సవ మూర్తుల విగ్రహాలను ప్రతిష్టించి పుష్పాలతో అభిషేకం చేసి పూల మాలలు వేసి కన్నుల పండువగా అలంకార ప్రియుడిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వడ్డించిన వంటకాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మండలంలోని పీఠాల గురుస్వాములు, భక్త జనుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదంను 3 వేల మందికి పైగా భక్తులు, పురజనులు స్వీకరించి స్వామి వారి కృపకు ప్రాతులయ్యారు.

## ఓటర్ జాబితాపై కలెక్టర్ సమీక్ష
# రాజకీయ పార్టీలతో భేటీ!

కామారెడ్డి జిల్లా ఏప్రిల్ 01((భారత శక్తి ప్రతినిధి)): ఓటర్ జాబితా ప్రత్యేక సమీక్ష (ఎస్ఐఆర్-2025) కార్యక్రమానికి సంబంధించిన ముఖ్య సూచనలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన బుధవారం మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఎస్ఐఆర్-2025 ప్రక్రియలో భాగంగా ఓటర్ల వర్గీకరణ, నమోదు, ధృవీకరణ చర్యలను సమగ్రంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లను నాలుగు ప్రధాన వర్గాలుగా విభజించినట్లు వివరించారు:

కేటగిరి ఏ: 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, వయస్సు 39 సంవత్సరాల పైబడిన వారు మరియు 2002 ఓటర్ జాబితాలో కూడా నమోదు ఉన్న వ్యక్తులు.

కేటగిరి బి: 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, వయస్సు 39 సంవత్సరాల పైబడిన వారు అయితే 2002 ఓటర్ జాబితాలో నమోదు లేని వ్యక్తులు.

కేటగిరి సి : 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, 21 నుండి 38 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓటర్లు.

కేటగిరి డి: 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో



నమోదై, 18 నుండి 20 సంవత్సరాల మధ్య వయస్సు గల యువ ఓటర్లు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వర్గానికి చెందిన ఓటర్ల వివరాలను ఖచ్చితంగా సేకరించి, ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ జాబితాను నవీకరించాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. డూప్లికేట్ నమోదు, మరణించిన వారి పేర్లు, చిరునామా మార్పులు వంటి అంశాలను గుర్తించి సరిచేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద బిఎల్ఏ లు చురుకుగా పనిచేయడం ద్వారా తప్పులు తగ్గి, ఖచ్చితమైన ఓటర్ జాబితా సిద్ధమవుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత పెంపొందించడంలో రాజకీయ పార్టీల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించబడాలని, ప్రతి దశలో స్పష్టత ఉండేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# హరీష్ రావును విమర్శించే స్థాయి నీదా..?: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరువు, మార్చి 31 (భారత శక్తి న్యూస్): పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హరీష్ రావును విమర్శించే స్థాయి కాటా శ్రీనివాస్ గౌడ్‌కు లేదని అన్నారు. అభివృద్ధి నినాదం తమదైతే, అవినీతి చరిత్ర మాత్రం ఆయనదేనని మండిపడ్డారు.

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు గట్టి బుద్ధి చెప్పినా కూడా ఆయనలో మార్పు రాలేదని విమర్శించారు. మంత్రి కుమార్తె వివాహ ఖర్చుల పేరుతో కోట్ల రూపాయలు వసూళ్లు చేసిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. సొంత కుటుంబాన్నే ద్రోహం చేసిన చరిత్ర కాటా శ్రీనివాస్ గౌడ్‌దని, తన స్వార్థం కోసం తల్లినే పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కించాడని ఆరోపించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కూడా అమ్ముకున్నాడని,ఎన్నికలు వస్తే బీఫాంలకు రేటు కట్టి అమ్ముకోవడం అలవాటైందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గల్లీ గల్లీకి కలెక్షన్ ఏజెంట్లను పెట్టి వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. గత రెండున్నర సంవత్సరాల్లో జరిగిన వసూళ్ల చిట్టాను బయటపెడతానని హెచ్చరించారు. అమీన్పూర్ సర్పంచ్‌గా ప్రజలు నమ్మి గెలిపించినా రెండు సంవత్సరాల్లోనే పదవి నుంచి తొలగించబడ్డారని గుర్తు చేశారు. ఒక సర్పంచ్ పదవిని పూర్తి కాలం నిర్వహించలేని అసమర్థుడు కాటా శ్రీనివాస్ గౌడ్ అని విమర్శించారు. ప్రజల కోసం వందల ఎకరాలు అమ్ముకున్న చరిత్ర తనదని పేర్కొన్నారు. తాను గజం భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే



బహిరంగ విచారణకు సిద్ధమని సవాల్ విసిరారు.

**మైనింగ్ కేసులపై వివరణ**

2012లో పటాన్చెరు మండలంలోని లకడారం గ్రామం సర్వే నంబర్ 738లో సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్ సప్లై పేరిట ప్రభుత్వ అనుమతులతో 15 సంవత్సరాల లీజుతో క్వారీ ప్రారంభించామని తెలిపారు. క్వారీ కేటాయించిన భూమిలో ముందుగానే జాతీయ రహదారి పనుల కోసం ప్రోగ్రెసివ్ కన్స్ట్రక్షన్ సంస్థ పెద్ద ఎత్తున మైనింగ్ నిర్వహించిందని చెప్పారు. ఈ విషయాన్ని అప్పటికే మైనింగ్ శాఖ అధికారులకు తెలియజేశామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్వారీ నిర్వహిస్తున్నప్పటికీ 2024లో రాజకీయ కక్షతో అనుమతికి మించి మైనింగ్ చేస్తున్నారంటూ క్వారీని సీజ్ చేశారని ఆరోపించారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 520 క్రషర్ క్వారీలకు నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడి క్వారీ అన్న కక్షతోనే నిబంధనలు పక్కనబెట్టి, ప్రతినిధులు లేకుండానే సర్వే చేసి రూ.300 కోట్ల జరిమానా విధించారని విమర్శించారు.

ఈ అంశంపై రీసర్వే చేయాలని రాష్ట్ర హైకోర్టు మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. హైకోర్టు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చినా ఇప్పటివరకు రీసర్వే జరగలేదని తెలిపారు.

**పోచారం భూములపై స్పష్టీకరణ**

పటాన్చెరు రెవెన్యూ పరిధిలోని పోచారం సర్వే నంబర్ 62లోని 5 ఎకరాల భూమి విషయమై కూడా ఎమ్మెల్యే వివరణ ఇచ్చారు. 1974లో వెంకటేశ్వర్లు అనే స్వాతంత్ర సమరయోధుడికి ప్రభుత్వం ఈ భూమిని కేటాయించిందని తెలిపారు. 1997లో ఆయన ఈ భూమిని శంకర్ లాల్‌కు విక్రయించగా,1998 నుంచి శంకర్ లాల్ ఆ భూమిని పలువురికి అమ్మినట్లు చెప్పారు.ఈ భూమికి తమకు లేదా తమ కుటుంబ సభ్యులకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఇకపై ఈ అంశంపై నిరాధార ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.

# వంటింటి వ్యర్థాలు... పోషకాలు!



**మొక్కలు పెంచడం అందరికీ సరదానే. కొన్నాళ్లు బాగానే పూసినా తర్వాత ఆ మట్టిలో సారం తగ్గి నిర్జీవంగా మారిపోతుంటాయి. ఇలాంటప్పుడు దాన్ని సులువుగా ఎలా సారవంతం చేసుకోవాలో తెలుసా?**

ఒక ఖాళీ కుండీని తీసుకోండి. అడుగున ఒక లేయర్ చిన్న చిన్న రాళ్లు వేయండి. ఆపై రెండు వరుసల్లో మట్టిని వేసి ఉంచండి. దీనిపై కూరగాయల వ్యర్థాలు, పండ్ల తొక్కలు వంటివి వేసి పైన మరోసారి మట్టి వేయండి. ఇలా ఒకదాని తర్వాత మరొకటి వేస్తూ కాసిని నీళ్లు చల్లుతూ ఉండండి. నెలరోజుల లోపే ఆ మట్టి సారవంతంగా మారుతుంది.

మొక్క చుట్టూ ఉండే మట్టి తరచూ బిగుసుకుపోతుంది. అలాకాకుండా ఉండాలంటే ఎండిన ఆకుల్ని పొడి చేసి మట్టిలో కలిపేయండి. ఇది మట్టిని



గట్టిపడనివ్వదు.

# ప్రొటీన్ల కోసం..!

**కండర వ్యవస్థను దృఢంగా ఉంచడంలో ప్రొటీన్ల పాత్ర మనకు తెలిసిందే. శరీరం బలంగా, ఆరోగ్యంగా ఉండేందుకు, రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకూ దోహదం చేసే ప్రొటీన్లు.. కేవలం మాంసాహారంలోనే కాదు.. కొన్ని రకాల శాకాహార పదార్థాలలోనూ అధికంగానే లభిస్తాయి. మరి వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే ప్రొటీన్ల లోపాన్ని అధిగమించవచ్చంటున్నారు నిపుణులు. మరి అవేంటో చూద్దాం రండి..**



**క్వినోవా**

ప్రొటీన్ల లోపంతో బాధపడే వారికి క్వినోవా మంచి ఆహారం. వీటిలోని అన్‌శ్యాచురేటెడ్ కొవ్వులు, క్యాల్షియం, మాంగనీస్, పొటాషియం, ఫాస్ఫరస్, కాపర్, జింక్, బి6, ఇ, నియాసిన్, థయమిన్.. వంటి విటమిన్లు, పోషకాలు శరీరానికి ఆరోగ్యాన్ని అందిస్తాయని చెబుతున్నారు నిపుణులు. ఇక అమైనో ఆమ్లాలు, ఒమేగా3 ఫ్యాటీ ఆమ్లాల రూపంలో శరీరానికి అవసరమైన కొవ్వులు కూడా క్వినోవాలో ఉంటాయట. పీచు పదార్థాలు అధికంగా ఉండే క్వినోవా బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహార మంటున్నారు నిపుణులు.

**ఓట్స్**

ప్రొటీన్లే కాదు అన్ని రకాల పోషకాలు పుష్కలంగా ఉండే ఓట్స్‌ను 'సూపర్‌ఫుడ్' అని పిలుస్తుంటారు. ఇందులో కార్బొహైడ్రేట్లు, పీచుపదార్థాలు, మాంగనీస్, ఫాస్ఫరస్, కాపర్, ఐరన్, సెలీనియం, మెగ్నీషియం, జింక్ లాంటి మినరల్స్ కూడా ఉంటాయి. పాలు, తేనె మొదలైన వాటితో కలిపి ఓట్స్‌ను తీసుకుంటే శరీరానికి మరిన్ని పోషకాలు అందుతాయని



చెబుతున్నారు నిపుణులు.

**సబ్జా**

బరువు తగ్గించుకుని రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలనుకునే వారికి సబ్జా గింజలు మంచి ఆహారమని చెప్పుకోవచ్చు. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ప్రొటీన్‌తో పాటు ఫైబర్ ఉంటుంది. గ్లూటెన్ ఉండదు. యాంటీ ఆక్సిడెంట్లతో పాటు ఒమేగా3 ఫ్యాటీ ఆమ్లాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ గింజల్లో ఫైబర్ మోతాదు ఎక్కువగా ఉండడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. సాధారణంగా సబ్జా గింజల్ని నీటిలో నానబెట్టుకుని తినచ్చు. లేకపోతే సలాడ్లు, స్మూతీలతో కలుపుకొని తీసుకున్నా అందులోని పోషకాలు శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు.

**వీటిలోనూ..!**

సాధారణంగా కూరగాయలు, పండ్లలో ప్రొటీన్ల శాతం తక్కువగా ఉంటుంది. అయితే బచ్చలి కూర, తోటకూర, బ్రకలి.. మొదలైన వాటిలో మాత్రం ప్రొటీన్లు పుష్కలంగా లభ్యమవుతాయంటున్నారు నిపుణులు.

# ఆర్థిక నేరగాళ్లకు చెక్.. నేరేడ్‌మెట్‌లో ఈఓడబ్ల్యూ పీఎస్ ప్రారంభం

* రూ. 2 కోట్లు దాటిన మోసాలపై నజర్
* రిబ్బన్ కట్ చేసిన మల్కాజిగిరి సీపీ
* స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా కోస్గి భాస్కర్ బాధ్యతలు

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 1(భారత శక్తి) : పెరుగుతున్న ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక విభాగం రంగంలోకి దిగింది. నేరేడ్‌మెట్‌లోని సిపిఓ (CPO) ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్థిక నేరాల విభాగం (EOW) పోలీస్ స్టేషన్‌ను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బుధవారం అధికారికంగా ప్రారంభించారు. పోలీస్ క్వార్టర్స్ నుంచి తన కార్యకలాపాలను మొదలుపెట్టిన ఈ స్టేషన్‌లో సీపీ స్వయంగా జి.డి (GD) ఎంట్రీ రాసి విధులను ప్రారంభించారు.

**భారీ మోసాలపై ప్రత్యేక నిఘా**

సాధారణ పోలీస్ స్టేషన్లపై పనిభారాన్ని తగ్గించి, సంక్లిష్టమైన ఆర్థిక మూలాలను ఛేదించేందుకు ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఈ క్రింది అంశాలపై ఈఓడబ్ల్యూ ఫోకస్ పెట్టనుంది:

కోట్ల రూపాయల స్కామ్‌లు: రూ. 2 కోట్లకు పైబడిన భారీ ఆర్థిక మోసాలు, నమ్మకద్రోహం, ఫోర్జరీ కేసులను ఈ విభాగం దర్యాప్తు చేస్తుంది.

డిపాజిటర్ల రక్షణ: తెలంగాణ రాష్ట్ర డిపాజిటర్ల రక్షణ చట్టం 1999 (2023 సవరణ) ప్రకారం రూ. 1 కోటి దాటిన డిపాజిట్ మోసాల విచారణను చేపడుతుంది.

కీలక కేసులు: సీపీ ఆదేశాల మేరకు బదిలీ అయ్యే ఇతర సెన్సేషనల్ ఆర్థిక నేరాలను కూడా ఈ బృందం డీల్ చేస్తుంది.



**అనుభవజ్ఞులతో ప్రత్యేక బృందం**

ఈ విభాగానికి పర్యవేక్షకులుగా రోడ్ సేఫ్టీ డీసీపీ కె. మనోహర్ వ్యవహరిస్తారు. వారికి సహాయకులుగా ఏసీపీలు పి. సత్తయ్య, సి. అంజయ్య ఉంటారు. కాగా, ఈ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO)గా కోస్గి భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. భాస్కర్ మొన్నటి వరకు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. వీరితో పాటు ఇన్‌స్పెక్టర్లు ఎ. సూర్య నాయక్, కె. రవి కుమార్ విధుల్లో చేరారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఈ విభాగం పనిచేస్తుందని ఈ సందర్భంగా సీపీ పేర్కొన్నారు.




## బడంగ్‌పేట్ సర్కిల్‌లో
# ‘ 40.25 కోట్ల పన్నుల వసూలు

* గత ఏడాదితో పోలిస్తే గణనీయ వృద్ధి
* 70.89 శాతం లక్ష్యం పూర్తి
* సహకరించిన నగర ప్రజలకు అధికారుల కృతజ్ఞతలు

బడంగ్‌పేట్, ఏప్రిల్ 1(భారత శక్తి) : బడంగ్‌పేట్ సర్కిల్ 16 (శంషాబాద్ జోన్) పరిధిలో 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూళ్లు ఉత్సాహంగా సాగాయి. మార్చి 31వ తేదీతో ముగిసిన గడువు నాటికి ఈ సర్కిల్‌లో రికార్డు స్థాయిలో రూ. 40.25 కోట్ల పన్ను వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి వసూళ్లు ఆశాజనకంగా ఉండటం పట్ల మున్సిపల్ యంత్రాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

**లక్ష్యం దిశగా..**


సర్కిల్ పరిధిలో మొత్తం రూ. 76.52 కోట్ల మేర పన్ను డిమాండ్ ఉండగా, పలు సాంకేతిక కారణాల వల్ల కొంత మొత్తం మినహాయింపునకు గురైంది. పౌల్ట్రీ షెడ్లు, కూలిపోయిన గృహాలు మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కొత్తగా వచ్చిన ఇంటి నంబర్లకు సంబంధించిన సుమారు రూ. 14 కోట్ల బకాయిలను పరిగణనలోకి తీసుకోగా, నికర వసూళ్లలో 70.89 శాతం లక్ష్యాన్ని అధికారులు చేరుకున్నారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి పన్ను రికవరీని వేగవంతం చేశారు.

* **అవగాహన పెరిగింది.. పట్టణం అభివృద్ధి చెందింది!**

పన్ను చెల్లింపులపై నగర ప్రజల్లో పెరిగిన అవగాహనే ఈ విజయానికి ప్రధాన కారణమని అధికారులు భావిస్తున్నారు. పట్టణ మౌలిక వసతుల కల్పనకు పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించడం శుభపరిణామమని కొనియాడారు. ఈ క్రమంలో అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించిన కాలనీ అసోసియేషన్ల సభ్యులకు, పౌరులకు మరియు సమాచార వ్యాప్తిలో తోడ్పడిన పాత్రికేయ మిత్రులకు జిహెచ్‌ఎంసీ (GHMC) డిప్యూటీ కమిషనర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ట్రేడింగ్ ‘నిలువు దోపిడీ’.. నిందితులు ఏపీ స్టూడెంట్లు!

* నకిలీ యాప్‌తో నాగోల్ ఫ్యాకల్టీకి రూ. 36 లక్షల నామం
* ఏడు కోట్ల లాభమని నమ్మించి సీన్ రివర్స్.. పెద్దమీరంలో కాల్ సెంటర్ గుట్టురట్టు




మల్కాజిగిరి, ఏప్రిల్ 1 (భారత శక్తి) : పెట్టుబడి తక్కువ.. లాభం కోట్లలో అంటూ ఊదరగొట్టే సైబర్ గాళ్ల మాటలు నమ్మి ఓ ఫ్యాకల్టీ నిలువునా మునిగిపోయాడు. ‘ట్రేడింగ్’ ముసుగులో సాగుతున్న భారీ దందాను మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులు ఛేదించారు. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లాలో కాల్ సెంటర్ పెట్టి అమాయకులను దోచుకుంటున్న ఎనిమిది మంది ముఠాను అరెస్ట్ చేశారు. వారి నుంచి 45 మొబైల్ ఫోన్లు, 40 ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

**వాట్సాప్ గ్రూపే వల..**

నాగోల్‌కు చెందిన ఫ్యాకల్టీ నవీన్ చందర్‌ను నిందితులు ‘Barclays’ అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా టార్గెట్ చేశారు. తమ ప్లాట్‌ఫారమ్‌లో ఇన్వెస్ట్ చేస్తే రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావొచ్చని నమ్మించారు. నమ్మకం కుదిరించేందుకు ఒక ఫేక్ ప్లాట్‌ఫారమ్‌ను క్రియేట్ చేసి, అందులో బాధితుడికి ఏకంగా రూ. 7 కోట్ల లాభం వచ్చినట్లు గ్రాఫిక్స్ చూపించారు. ఆ స్క్రీన్ చూసి నిజమేనని నమ్మిన బాధితుడు.. తన దగ్గరున్న డబ్బుతో పాటు అప్పులు చేసి మరీ వివిధ విడతల్లో రూ. 36.30 లక్షలు నిందితులు చెప్పిన అకౌంట్లలో జమ చేశాడు. తీరా డబ్బులు డ్రా చేద్దామనుకుంటే ‘ట్యాక్స్’ కట్టాలని వేధించడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

**నిందితులంతా కుర్రాళ్లే..**

ఈ కేసును ఛేదించేందుకు రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ సుధాకర్ టీమ్.. టెక్నికల్ ఆధారాలతో నిందితులు ఏపీలో ఉన్నట్లు గుర్తించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెద్దమీరం గ్రామంలోని ఓ ఇంట్లో కాల్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు కనిపెట్టి మెరుపు దాడి చేశారు. అరెస్టయిన ఎనిమిది మందిలో ఏ1 తో పాటు ఏ3 నుంచి ఏ9 వరకు నిందితులు ఉన్నారు. వీరంతా కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వారు. ఇందులో చదువుకునే స్టూడెంట్లు, డ్రైవర్లు ఉండటం గమనార్హం.

**సామగ్రి చూసి పోలీసులే షాక్!**

నిందితుల స్థావరం నుంచి స్వాధీనం చేసుకున్న సామాగ్రి చూస్తే దోపిడీ ఏ స్థాయిలో సాగుతుందో అర్థమవుతోంది.

గ్యాడ్జెట్స్: 45 మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, మూడు రౌటర్లు, రెండు ట్యాబ్‌లు.

బ్యాంకింగ్: 40 ఏటీఎం కార్డులు, 22 చెక్ బుక్కులు, 20 సిమ్ కార్డులు.

ఐడెంటిటీ: 5 ఆధార్ కార్డులు, పాన్ కార్డులను సీజ్ చేశారు.

**ఆశ పడితే అడ్రస్ లేకుండా పోతారు..**

తక్కువ టైంలో ఎక్కువ లాభాలు వస్తాయనే ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో ఇచ్చే అడ్వైజ్‌లను నమ్మి ఇన్వెస్ట్ చేయవద్దని కోరారు. ఏదైనా మోసం జరిగితే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. సీపీ అవినాష్ మొహంతి, డీసీపీ నాగ లక్ష్మి పర్యవేక్షణలో ఈ కేసును ఛేదించిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

# నర్సన్నపల్లి గ్రామంలో
## ఘణంగా కుల వివక్ష నిర్మూలన కార్యక్రమం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 01: కుల వివక్ష నిర్మూలనకు దిశగా నర్సంపల్లి గ్రామంలో బుధవారం సమగ్ర సామాజిక సమానత్వ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామంలోని దళితులకు అన్ని దేవాలయాలలో ప్రవేశం కల్పించడం, సహపంక్తి భోజనాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు ఈ సందర్భంలో చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ రవి, డీటీడివో సౌజన్య, తహసిల్దార్ హిమబిందు, ఇతర సంబంధిత అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు... కార్యక్రమం ప్రారంభంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం సమానత్వాన్ని ప్రతిపాదించిందని, సమాజంలో కులాల ఆధారంగా ఉన్న వివక్షలు, విభేదాలు పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమాన హక్కులతో జీవించే సమాజం నిర్మాణం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్న కుల వివక్షను నిర్మూలించడానికి ప్రభుత్వం, అధికారులు, ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేవాలయాలు, సామాజిక కార్యక్రమాలు, పండుగలు వంటి అన్ని వేదికలలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కుల వివక్ష లేదా దళితులపై ఏ విధమైన అన్యాయం జరిగినా, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం సమానత్వం, సామాజిక న్యాయం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. గ్రామాల్లో సామాజిక ఐక్యత పెంపొందించుకోవాలని అన్నారు. తదుపరి అదనపు కలెక్టర్, అధికారులు, ప్రజలు కలిసి గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం, శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలోకి అన్ని వర్గాల ప్రజలు కలిసి ప్రవేశించడం ద్వారా సామాజిక సమానత్వానికి ప్రాతినిధ్యం వహించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనాలు నిర్వహించడం ద్వారా కుల వివక్షకు వ్యతిరేకంగా బలమైన సందేశం పంపించారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఐక్యత, సామరస్య వాతావరణాన్ని నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, అధికారులు సమన్వయంతో కృషి చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

# సలేశ్వరం జాతరలో ‘ప్లాస్టిక్’ వద్దు

* ప్రకృతిని కాపాడుకుందాం: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి.
* ప్రపంచ పర్యావరణ సంస్థ గోడపత్రిక ఆవిష్కరణ.
* నల్లమలలో కాలుష్య నివారణకు భక్తులు సహకరించాలి.




హైదరాబాద్, మార్చి 1(భారత శక్తి) : ప్రకృతి ఒడిలో వెలసిన సలేశ్వరం లింగమయ్య క్షేత్రాన్ని కాలుష్య కోరల నుంచి కాపాడాలని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పిలుపునిచ్చారు. అడవిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భక్తుడిపై ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దక్షిణ అమరనాథ్ యాత్రగా పేరొందిన సలేశ్వరం జాతర నేటి నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో, భక్తులంతా క్రమశిక్షణతో మెలగాలని కోరారు. ప్లాస్టిక్ రహిత జాతరగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సూచించారు.

* **పర్యావరణ పరిరక్షణలో ‘ప్రపంచ పర్యావరణ సంస్థ’ భేష్**

గడిచిన 14 ఏళ్లుగా ‘స్వచ్ఛ భారత్ స్వస్థ భారత్’ లక్ష్యంతో గల్లీ నుంచి ఢిల్లీ దాకా ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కృషిని గవర్నర్ కొనియాడారు. సుమారు 10 వేల మంది టీచర్లకు శిక్షణ ఇచ్చి, పర్యావరణ ఉద్యమంలో భాగస్వాములను చేయడం గొప్ప విషయమన్నారు. తిరుమల, మేడారం వంటి పుణ్యక్షేత్రాల్లో ప్లాస్టిక్ నివారణకు సంస్థ చేస్తున్న పోరాటాన్ని ఆయన అభినందించారు. ప్రజా చైతన్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**ఇంటికి.. ఒంటికి ప్లాస్టిక్ ముప్పు!**

ప్రజల సంపాదనలో 30 శాతం హాస్పిటల్స్ పాలవుతోందని, దీనికి ప్లాస్టిక్ కాలుష్యమే ప్రధాన కారణమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్. భద్ర ఆందోళన వ్యక్తం చేశారు. “మనం తినే ఆహారం, తాగే నీటి ద్వారా రోజూ 2 నుంచి 4 గ్రాముల ప్లాస్టిక్ శరీరంలోకి వెళ్తోంది. దీన్ని అరికట్టేందుకు స్టీల్ బాటిళ్లు, జ్యూట్ బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాం” అని సంస్థ జాతీయ కార్యదర్శి సాగర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో కోటి మందిని చైతన్యపరచడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, సంస్థ సభ్యులు శ్రావణ్ యాదవ్, పవన్ కుమార్, యంగ్ లీడర్స్ ఫౌండర్ జయంత్, సిరి చందన తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.టి.ఆర్ బరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న
# డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 01(భారతశక్తి ప్రతినిధి): ఎన్.టి.ఆర్ బరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో , పోరుమామిళ్ళ మండలం, పోరుమామిళ్ళ పంచాయతీ 5 వ వార్డు ఉద్దికట్ట నందు సచివాలయ సిబ్బందితో కలిసి నిర్వహించే ఈ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఓబుళాపురం రాజశేఖర్, నియోజకవర్గ యువనాయకులు చెరుకూరి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చెరుకూరి చెంద్రాయుడు, మాజీ రంగసముద్రం సర్పంచ్ నడిపి వెంకట సుబ్బయ్యా,చిన్న వెంకటసుబ్బయ్య, చంద్రగిరి ప్రహ్లాద రెడ్డి, కల్లూరు దుగ్గిరెడ్డి, ,రహమతుల్లా మొగల్, అరవ శ్రీనివాసరెడ్డి, బిజి వేముల చంద్ర, మాచుపల్లి కృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమేష్ రెడ్డి, రాళ్లపల్లి గిరి, గాజులపల్లి రవి,కోడూరు లక్ష్మీనారాయణ, రామయ్య, నరసయ్య, వెంకట సుబ్బయ్య, ప్రసాదు, గులాం గౌస్, పీరా, కమల్ భాష, చాంద్ బాషా, మొగల్ జిలాని, మొగల్ పెద్ద రసూల్,sp షరీఫ్, సుబ్బారాయుడు యాదవ్,తుపాకుల ప్రసాద్,గురుప్రసాద్ రెడ్డి,నవీన్ కుమార్ రెడ్డి,మహేష్,ఉప్పత్తి సుబ్బారెడ్డి, అన్నదురు వెంకట సుబ్బారెడ్డి,కోటపాటి పెంచాలయ్యా,దేవినేని వెంకతసుబ్బారెడ్డి, క్రిష్ణ ,షేక్ రఫీ, నాయబ్,రఫీ, అన్నపురెడ్డి వెంకట సుబ్బయ్య, ఆఫీజ్, గాజుల వెంకటసుబ్బయ్య, బాలచంద్ర, పుల్లయ్య, నగిరి రమణయ్య, రాజేష్ , సాయికుమార్ , సుధాకర్, వలి,ధర్మవరపు సుబ్బయ్య, గోవిందాయపల్లి బాలు, చెన్నకేశవ నాయుడు, అనిల్,గోపాల్,సందీప్ పగిడి,కోనేటి కేశవ, ప్రభు, మొగల్ జిలాని,బొజ్జ చిన్నబాబు,చిన్నప్ప, కలవకూరి సురేంద్ర, పెద్దఎత్తున కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు: మార్కో రూబియో

* యూరప్‌ను తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందన్న రూబియో
* అణుబాంబు తయారీకి ఇరాన్ అత్యంత సమీపంలో ఉందని వెల్లడి
* ఇరాన్‌పై సైనిక చర్య విజయవంతంగా సాగుతోందన్న అమెరికా
* చర్చలకు సిద్ధమేనని, కానీ షరతులు వర్తిస్తాయని స్పష్టం
* హోర్ముజ్ జలసంధిలో జోక్యం చేసుకోవద్దని ఇరాన్‌కు హెచ్చరిక

ఏప్రిల్ 01 : యూరప్‌లోని సుదూర ప్రాంతాలను సైతం తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా చేపట్టిన సైనిక చర్యను సమర్థిస్తూ, ఇరాన్ ఆయుధ కార్యక్రమాలతో ప్రపంచానికి పెను ముప్పు ఉందని ఆయన హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రూబియో మాట్లాడుతూ, ఇరాన్ ఇటీవల ప్రయోగించిన క్షిపణులు తమ అంచనాలకు మించిన సామర్థ్యాన్ని ప్రదర్శించాయని తెలిపారు. "ఆ క్షిపణులు యూరప్‌లోని చాలా ప్రాంతాలకు చేరగలవు" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా ప్రధాన భూభాగాన్ని కూడా లక్ష్యంగా చేసుకునే దీర్ఘశ్రేణి క్షిపణుల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాలను వేర్వేరుగా చూడలేమని రూబియో స్పష్టం చేశారు. "ఇరాన్ ఇప్పటికే 60 శాతం స్వచ్ఛతతో యురేనియంను శుద్ధి చేసింది. కేవలం 12 నుంచి 14 రోజుల్లోనే దాన్ని 90 శాతం స్వచ్ఛతకు (అణుబాంబు తయారీకి అవసరమైన స్థాయి) చేర్చగలదు. అణుబాంబులో ఉపయోగించడానికి తప్ప 60 శాతం శుద్ధి చేసిన యురేనియం వల్ల మరో ప్రయోజనం ఉండదు" అని ఆయన వివరించారు. ఇరాన్ తన అణు కార్యక్రమానికి రక్షణ కవచంగా అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించేందుకే సైనిక చర్య ప్రారంభించామని రూబియో తెలిపారు. ఇరాన్ వాయుసేన, నౌకాదళాన్ని ధ్వంసం చేయడం, క్షిపణి లాంచర్లను నిర్వీర్యం చేయడం, డ్రోన్లు, క్షిపణుల తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేయడం వంటి నాలుగు లక్ష్యాలతో ఈ ఆపరేషన్ సాగుతోందని చెప్పారు. "ఈ లక్ష్యాల సాధనలో మేము అనుకున్నదానికంటే వేగంగా ఉన్నాం. లక్ష్యానికి చాలా దగ్గరగా ఉన్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సైనిక చర్య కొనసాగుతున్నప్పటికీ, చర్చల ద్వారాలు తెరిచే ఉన్నాయని, ఇరుపక్షాల మధ్య సందేశాలు మార్పిడి జరుగుతున్నాయని రూబియో అన్నారు. అయితే, చర్చల పేరుతో కాలయాపన చేయడాన్ని సహించబోమని, దొంగచాటు చర్చలకు అంగీకరించబోమని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు ఇరాన్ ఆటంకం కలిగిస్తే అది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలుగుతుందని హెచ్చరించారు.

## చండీగఢ్ బిజెపి ఆఫీస్ వద్ద భారీ పేలుడు

చండీగఢ్, ఏప్రిల్ 01 (భారతశక్తి ప్రతినిధి): చండీగఢ్ బీజేపీ కార్యాలయం వద్ద పేలుడు సంభవించింది. పార్క్ చేసి ఉంచిన స్కూటీలో పేలుడు చోటు చేసుకుంది. బీజేపీ పంజాప్ రాష్ట్ర కార్యాలయం వద్ద పేలుడు సంభవించిన విషయం తెలియగానే పోలీసు బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. చండీగఢ్‌లోని సెక్టార్ 37లో సాయంత్రం 5 గంటల తర్వాత పేలుడు చోటు చేసుకుంది. బీజేపీ సీనియర్ నాయకులు, కార్యాలయంలోని నాయకుల ప్రకారం, ఈ పేలుడు కారణంగా భారీ మొత్తంలో నష్టమేమీ జరగలేదు. విషయం తెలియగానే కార్యాలయం వద్దకు చేరుకున్న పోలీసులు, ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పేలుడుకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పంజాబ్ బీజేపీ మాజీ అధ్యక్షుడు అశ్వని శర్మ పేలుడుకు సంబంధించిన ఫొటోలను తన సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా పంచుకున్నారు.

## "అల్లుడు తులం బంగారం అడుగుతున్నాడు"
### తలసాని వద్ద మహిళ ఆవేదన

హైదరాబాద్, ఏప్రిల్ 01 (భారతశక్తి ప్రతినిధి): సికింద్రాబాద్‌లో కల్యాణ లక్ష్మి పంపిణీ కార్యక్రమం సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఓ మహిళ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. సికింద్రాబాద్‌లోని తహసీల్దారు కార్యాలయంలో ఆయన చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక మహిళ కల్యాణ లక్ష్మి చెక్కును తీసుకున్న అనంతరం తులం బంగారం గురించి అడిగారు. ఆడపిల్ల వివాహానికి తులం బంగారం ఇస్తామని చెప్పారని, కానీ ఇప్పటి వరకు ఏమీ ఇవ్వలేదని ఆ మహిళ తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో అన్నారు. వివాహం సమయంలో ప్రభుత్వం ఇచ్చే తులం బంగారం ఇస్తామని మా అల్లుడికి చెప్పడంతో, అతను అడుగుతున్నట్లు తెలిపారు. దానికి తలసాని శ్రీనివాస్ యాదవ్ నవ్వుతూ, హామీ ఇచ్చిన వారు ఇవ్వడం లేదని, దానికి మనమేం చేస్తామని సమాధానం ఇచ్చారు. కాగా, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వివాహం కోసం ప్రతి ఆడపిల్లకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నిలబెట్టుకోవడం లేదని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

## ఒకే ఒక రాజధాని... అమరావతికి ఇక తిరుగులేదు

అమరావతి, ఏప్రిల్ 01 (భారతశక్తి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్రుల ఆత్మగౌరవానికి, ప్రజల ఆకాంక్షలకు లభించిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక పరిణామంతో రాజధాని భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ, "గత ప్రభుత్వ పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయాయి. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక. రైతుల త్యాగానికి దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయి. అమరావతి ఇక అజేయం.. అజరామరం" అని అన్నారు. రాజధానిని ప్రపంచపటంలో నిలిపేలా విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ బిల్లు ఆమోదానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు

అమరావతి, ఏప్రిల్ 01 (భారతశక్తి ప్రతినిధి): అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు తెలుపుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ జరిగింది. లోక్ సభలో కేంద్ర హోంశాఖ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. చివరి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా 1200 మంది విద్యార్థులు ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఉందని అన్నారు. దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యమే కారణమని ఆరోపించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావాల్సి ఉందని అన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీజేపీ తరపున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.

## ఎల్పీజీ సెగ: హైవేపై ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, ఏప్రిల్ 01 (భారతశక్తి ప్రతినిధి): హైదరాబాద్ నగరంలో ఆటో ఎల్పీజీ గ్యాస్ కొరత తీవ్ర రూపం దాల్చింది. గ్యాస్ కోసం గంటల తరబడి ఎదురుచూసి విసిగిపోయిన ఆటో డ్రైవర్లు రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టారు. సాగర్ రింగ్ రోడ్డు, ఎల్బీ నగర్, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ వంటి పలు ప్రాంతాల్లో రాస్తారోకోలు, ధర్నాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గత రెండు వారాలుగా ఈ సమస్య కొనసాగుతుండటంతో తమ జీవనోపాధి దెబ్బతింటోందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర బారులు తీరి, రాత్రంతా వేచి ఉన్నా గ్యాస్ దొరకడం లేదని వాపోతున్నారు. నిరసనలో భాగంగా కొందరు డ్రైవర్లు రాజేంద్రనగర్‌లో సెల్ టవర్ ఎక్కి ఆందోళన చేయగా, బహదూర్‌పురాలో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. రాష్ట్రంలో రోజుకు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీ కొరత ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా విదేశాల నుంచి గ్యాస్ దిగుమతులు ఆలస్యం కావడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించి, సరఫరాను పెంచాలని చమురు సంస్థలను ఆదేశించారు. ఆందోళనల నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు రంగ ప్రవేశం చేసి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. నిరసన చేస్తున్న డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అయితే, గ్యాస్ కొరత సమస్య పరిష్కారం కాకపోవడంతో తమ ఆందోళనలు కొనసాగిస్తామని ఆటో డ్రైవర్ల సంఘాలు చెబుతున్నాయి.

## టికెట్ క్యాన్సిలేషన్: ప్రయాణికులకు షాక్!

ఢిల్లీ, ఏప్రిల్ 01 (భారతశక్తి ప్రతినిధి): భారతీయ రైల్వే ప్రయాణికులకు ఇది ముఖ్య గమనిక. రైలు టికెట్ల రద్దు, రిఫండ్ విధానంలో కీలకమైన మార్పులు నేటి (ఏప్రిల్ 1) నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్త నిబంధనల ప్రకారం, రైలు బయలుదేరడానికి 8 గంటలలోపు కన్ఫర్మ్ టికెట్‌ను రద్దు చేసుకుంటే ప్రయాణికులకు ఎలాంటి రిఫండ్ లభించదు. గతంలో ఈ గడువు 4 గంటలుగా ఉండేది. ప్రయాణానికి 8 గంటల నుంచి 24 గంటల మధ్యలో టికెట్‌ను రద్దు చేస్తే టికెట్ ధరలో 50 శాతం మాత్రమే తిరిగి వస్తుంది. అదేవిధంగా, 24 గంటల నుంచి 72 గంటల ముందు రద్దు చేసుకుంటే 25 శాతం కోత విధించి, 75 శాతం మొత్తాన్ని రిఫండ్ చేస్తారు. ఒకవేళ ప్రయాణానికి 72 గంటల కంటే ముందే టికెట్‌ను రద్దు చేస్తే కేవలం సాధారణ రద్దు ఛార్జీలు మాత్రమే వర్తిస్తాయి. టికెట్ ఏజెంట్లు, దళారులు పెద్ద సంఖ్యలో టికెట్లను బ్లాక్ చేసి, చివరి నిమిషంలో రద్దుచేయడాన్ని అరికట్టేందుకే ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్లు రైల్వే శాఖ తెలిపింది. దీనివల్ల నిజమైన ప్రయాణికులకు చివరి నిమిషంలో కూడా బెర్తులు అందుబాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా దశలవారీగా అమలు కానున్నాయి. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి, తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని రైల్వే అధికారులు సూచిస్తున్నారు.

## కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయండి

హైదరాబాద్, ఏప్రిల్ 01 (భారతశక్తి ప్రతినిధి): కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే కేటీఆర్ లేఖ రాశారు. కేటీఆర్ రాసిన లేఖను బీఆర్ఎస్ ఎంపీల బృందం ఢిల్లీలో కేంద్రమంత్రికి అందించింది. ఈ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ ఎంపీలు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌పై పనిభారం విపరీతంగా పెరిగిందని కేటీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ ట్రాక్ పరిధి 2,755 కిలోమీటర్లుగా ఉందని, మున్ముందు వాడి-రాయచూర్, విష్ణుపురం బీబీనగర్ డబ్లింగ్ పనులు పూర్తయితే ఈ ట్రాక్ పరిధి 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుందని తెలిపారు.




భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు ఉండాల్సిన పరిమితి కంటే ఇది ఎక్కువ అన్నారు. ఎక్కువ కిలోమీటర్లు, పనిభారం కారణంగా సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ క్లిష్టంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కాజీపేట కేంద్రంగా డివిజన్‌ను ఏర్పాటు చేస్తే పరిపాలనా సులువు అవుతుందని అన్నారు. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాల రీత్యా కాజీపేట డివిజన్ అత్యవసరమని ఆ లేఖలో పేర్కొన్నారు.

## మళ్లీ భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు




బంగారం, వెండి ధరలు మళ్లీ భారీగా పెరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్న సంకేతాల నేపథ్యంలో, ఖరీదైన లోహాల ధరలు పెరుగుతున్నాయి. మహావీర్ జయంతి సందర్భంగా నిన్న బులియన్ మార్కెట్‌కు సెలవు రోజు. కిలో వెండి ధర సోమవారం నాటి ముగింపు రూ.2.37 లక్షలతో పోలిస్తే రూ.9 వేలు పెరిగి రూ.2.46 లక్షలకు చేరుకుంది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర మొన్నటితో పోలిస్తే రూ.3,500 పెరిగినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ఈరోజు రూ.3,500 పెరిగి రూ.1.55 లక్షల వద్ద, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1.51 లక్షలు పలుకుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చనే సంకేతాలకు తోడు, కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచకపోవచ్చనే అంచనాలు బంగారం, వెండి ధరల భారీ పెరుగుదలకు కారణమైంది. ఇదిలా ఉండగా, 202526 ఆర్థిక సంవత్సరంలో బంగారం ధర ఏకంగా 61 శాతం పెరిగింది. గత ఏడాది ఏప్రిల్ 1న 10 గ్రాముల బంగారం ధర రూ.94,150గా ఉండగా ఇప్పుడు రూ.1,51,000 దాటింది. ఏడాది కాలంలో బంగారం రూ.57 వేలకు పైగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో బంగారం ఒకానొక సమయంలో రూ.1,70,000 దాటింది. కిలో వెండి ధర గత ఏడాది ఏప్రిల్ 1న రూ.1.34 లక్షలుగా ఉండగా, ఏడాది కాలంలో రూ.1 లక్షకు పైగా పెరిగింది. ఒకానొక సమయంలో వెండి కిలో రూ.4 లక్షలు దాటింది.

## బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీలు టచ్‌లో ఉన్నారు: కవిత

- సమయం వచ్చినప్పుడు వివరాలు చెబుతానన్న కవిత
- మావోయిస్టులు తమ పార్టీలో చేరుతారని వెల్లడి
- మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కోసం పోరాటం చేస్తామని ప్రకటన



హైదరాబాద్, ఏప్రిల్ 01 (భారతశక్తి ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు తమతో టచ్‌లో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు ప్రకటిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, అసెంబ్లీలో సమయం అంతా అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం తిట్లు, విమర్శలు చేసుకోవడానికే సరిపోయిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను శ్రీరాముడిని, కేసీఆర్ రావణుడు అని చెబుతున్నారని, కానీ శకుని ఎవరో చెప్పాలని ఎద్దేవా చేశారు. తాను బర్బరీకుడిని అని ముఖ్యమంత్రి చెప్పుకుంటుంటే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మావోయిస్టులు కూడా తమ పార్టీలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వారిది, తమది ఒకే అజెండా అని తెలిపారు. పార్టీ ఆవిర్భావానికి ముందు ఉమాభారతి సహా ఇతర పెద్దలను కలిసి ఆశీర్వాదం తీసుకుంటానని కవిత తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కోసం పోరాటం చేస్తామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోల పేరుతో ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 40 లక్షల కుటుంబాలలోని విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా, ప్రభుత్వం మాత్రం వారికి న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలని నిలదీశారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం పెట్టుకుందని ఆరోపించారు. 15 లక్షల రేషన్ కార్డులు తీసివేయాలని చూస్తోందని మండిపడ్డారు.

# కబ్జాకోరుల గుండెల్లో 'హైడ్రా' వణుకు!

* పాతబస్తీలో 100 కోట్ల విలువైన ప్లే గ్రౌండ్ విముక్తి
* బాలానగర్‌లో పార్కు స్థలం స్వాధీనం..
* నిర్మాణాల కూల్చివేత
* శాస్త్రిపురంలో జీ+3 భవనాలు నేలమట్టం
* నోటరీ దందాతో అమ్మేసిన 6,500 గజాల స్థలం రికవరీ
* ఫిర్యాదు అందిన గంటల్లోనే జేసీబీలతో యాక్షన్

హైదరాబాద్, ఏప్రిల్ 1 (భారత శక్తి) : గ్రేటర్ సిటీలో కబ్జాదారులు, భూబకాసురుల ఆటలకు 'హైడ్రా' చెక్ పెడుతోంది. సామాన్యుల కోసం కేటాయించిన పార్కులు, ఆటస్థలాలను మింగేస్తున్న పెద్దల అక్రమ సామ్రాజ్యాలను జేసీబీలతో కూల్చివేస్తోంది. తాజాగా బుధవారం పాతబస్తీ మైలార్‌దేవుపల్లితో పాటు బాలానగర్‌లో నిర్వహించిన భారీ ఆపరేషన్లలో సుమారు రూ.100 కోట్లకు పైగా విలువైన ప్రజా ఆస్తులను హైడ్రా కాపాడింది.

**వెంచర్ వెనుక పెద్దల దందా!**

రాజేంద్రనగర్ మండలం మైలార్‌దేవుపల్లి విలేజ్ శాస్త్రిపురం కాలనీలో 188 ఎకరాల్లో హుడా (HUDA) లేఅవుట్ ఉంది. ఇందులో నిబంధనల ప్రకారం 6,500 గజాలను క్రీడా మైదానం కోసం వదిలిపెట్టారు. అయితే, స్థానిక కబ్జాదారులు కన్ను ఈ ఖరీదైన స్థలంపై పడింది. హెచ్ఎండీఏ పర్మిషన్ లేఅవుట్ అని తెలిసి కూడా.. గత మూడేళ్లుగా నోటరీ పత్రాలతో ఇక్కడ ప్లాట్లు చేసి అమాయకులకు విక్రయించారు. ఎటువంటి అనుమతులు లేకుండానే ఇక్కడ భవన నిర్మాణాలు చేపట్టారు.

**రంగంలోకి హైడ్రా.. భారీ కూల్చివేతలు.**

స్థానికుల నుంచి ఫిర్యాదు అందడమే ఆలస్యం.. హైడ్రా ఫోర్స్ మైలార్‌దేవుపల్లిలో ల్యాండ్ అయింది. రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో లేఅవుట్‌ను పరిశీలించి, అది ఆటస్థలమేనని నిర్ధారించుకుంది. వెంటనే ఆపరేషన్ మొదలుపెట్టి నిర్మాణ దశలో ఉన్న ఐదు 'జీ ప్లస్ 3' అంతస్తుల భవనాలను నేలమట్టం చేసింది. మరో రెండు గదులను కూల్చేసింది. ఇప్పటికే నివాసం ఉంటున్న రెండు భవనాలను మాత్రం ప్రస్తుతానికి మినహాయించింది. సుమారు రూ. 100 కోట్ల విలువైన ఈ మైదానాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది.







**బాలానగర్‌లో పార్కు సేఫ్..**

మరోవైపు బాలానగర్ పరిధిలోని అక్షయ ఎన్‌క్లేవ్‌లోనూ హైడ్రా తన ప్రతాపం చూపింది. 1983 నాటి లేఅవుట్‌లో పార్కు కోసం కేటాయించిన 968 గజాల స్థలాన్ని అబ్దుల్ రెహ్మాన్ అనే వ్యక్తి తప్పుడు పత్రాలతో కాజేయాలని చూశారు. గతంలో జీహెచ్ఎంసీ ఫెన్సింగ్ వేసినా.. అధికార యంత్రాంగాన్ని బురిడీ కొట్టించి నిర్మాణాలకు ప్లాన్ చేశారు. 'ప్రజావాణి'లో కాలనీవాసుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు.. అక్కడ ఆక్రమణలను తొలగించి, అది ప్రభుత్వ స్థలమంటూ బోర్డులు పాతి కబ్జాదారులకు షాక్ ఇచ్చారు.

**కాలనీవాసుల హర్షం..**

"కబ్జాదారులను ఎదిరిస్తే మమ్మల్ని బెదిరించారు.. ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత హైడ్రా వల్ల మా పిల్లల ఆటస్థలం దక్కింది" అంటూ శాస్త్రిపురం కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి యాక్షన్ తీసుకుంటున్న హైడ్రా తీరుపై నగరవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# 'గడ్డిమందు'ను నిషేధించండి

* కేంద్రాన్ని కోరుతూ శాసనసభలో తీర్మానం... ఆమోదించిన శాసన సభ
* భారత శక్తి వార్త కథనానికి స్పందన



హైదరాబాద్, ఏప్రిల్ 01 (భారత శక్తి) : రైతులకు ప్రాణాంతకంగా పరిణమిస్తోన్న పారాక్వాట్ డై క్లోరైడ్ (గడ్డిమందు)ను నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర శాసనసభ కోరింది. ఈ మేరకు కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభలో తీర్మానం ప్రవేశపెట్టగా, ఈ తీర్మానంపై మాట్లాడిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పాల్వాయి హరీష్ బాబు, సి.హెచ్. విజయరమణారావు, రాంచంద్రు నాయక్, మురళీ నాయక్, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, భూపతిరెడ్డిలు మాట్లాడుతూ, గడ్డిమందును నిషేధించాలని కేంద్రాన్ని కోరడమే కాకుండా రాష్ట్రంలో కూడా నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిషేధం విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న వెసులుబాటును ఉపయోగించుకోవాలని కోరారు. పారాక్వాట్ వినియోగం కారణంగా రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, క్షణికావేశంలో దీన్ని తాగడం వల్ల జరుగుతున్న ప్రాణనష్టాలు ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని పారాక్వాట్ డైక్లోరైడ్ తయారీ, దిగుమతి, నిల్వ, రవాణా, విక్రయం, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని రాష్ట్ర అసెంబ్లీ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తీర్మానంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాగా, సభ ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

## ఎంఎంసీ పరిధిలోని
# ఎల్బీనగర్ జోన్ లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఎల్బీనగర్, ఏప్రిల్ 01 (భారత శక్తి): సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయాలలో బుధవారం ఉదయం నుండి సాయంత్రం 6 గంటల వరకు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఎల్బీనగర్ జోన్ పరిధిలోని సర్కిల్ కార్యాలయాలలో అధికారులు, సిబ్బంది పలు అవకతవకలకు పాల్పడుతున్నారని పలువురు ఉన్నతాధికారులకు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తుంది. ఉదయం 11గంటల సమయంలో మూడు సర్కిళ్ల కార్యాలయంలో వెళ్లిన విజిలెన్స్ అధికారులు సాయంత్రం వరకు తనిఖీలు చేపట్టారు. అధికారులు ప్రధానంగా ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు పద్దతిలో పని చేస్తున్న ఉద్యోగుల రిజిస్టర్లను, హాజరు పట్టికలను పరిశీలించడంతో పాటు ఎంత మంది ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు, వారు సమయానికి విధులకు హాజరవుతున్నారా లేదా అనే వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.



మొత్తం సర్కిల్ కార్యాలయలలో ఎంత మంది ఉద్యోగులు ఉన్నారు ఇంక ఎంత మంది అవసరం ఉంటుందనే వివరాలను తీసుకున్నట్లు పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారనే విషయం తెలుసుకున్న పలువురు జిహెచ్ఎంసి అధికారులు ముందుగానే కార్యాలయాల నుంచి జారుకున్నట్లు కింది స్థాయి సిబ్బంది పేర్కొంటున్నారు. విజిలెన్స్ అధికారులు టౌన్ ప్లానింగ్, శానిటేషన్, పన్నుల విభాగం, ఇతర విభాగాలలో తనిఖీలు నిర్వహించి పలు రిజిస్టర్లను స్వాధీనం చేసుకోని రిజిస్టర్లలో సంతకాలు చేయని వారందరి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలు రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి అదేశాల మేరకు అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తుంది.

# ఏసీబీ అధికారులకు చిక్కిన ఏఎస్ఐ



ఎల్బీనగర్, ఏప్రిల్ 01 (భారత శక్తి): రంగారెడ్డి జిల్లా కోర్టులో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్లీగా ఏసీబీ అధికారులకు పట్టుబడిన చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ పి. బాలయ్య. సీసీ నెంబర్ 363/2025,బీఎన్ఎస్ 78 కేసుకు సంబంధించి, నేరెళ్ల విక్రమ్ ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి, ఈ కేసులోని నిందితుడు పల్లపు రాంబాబు కేసును లోక్ అదాలాత్ లో రాజీ చేయిస్తానని అతని వద్ద బలవంతంగా డిమాండ్ చేసి 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు కాపు కాచి ఏఎస్ఐ బాలయ్యను అరెస్ట్ చేశారు.


# రేపే హనుమాన్ శోభాయాత్ర.. సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు!

* మల్కాజిగిరి వైపు వెళ్తున్నారా? అయితే ఇది చదవండి..
* తడ్బండ్ వైపు వాహనాలు బంద్.. ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాలని పోలీసుల సూచన

మల్కాజ్గిరి , ఏప్రిల్ 1 (భారత శక్తి) :హనుమాన్ జయంతి వేడుకలకు నగరం ముస్తాబైంది. గురువారం (ఏప్రిల్ 2న) నిర్వహించనున్న 'శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర' దృష్ట్యా మల్కాజిగిరి పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ జామ్ అవ్వకుండా స్పెషల్ ప్లాన్ వేశారు.

**12 కిలోమీటర్ల మేర యాత్ర..**

ఈ భారీ శోభాయాత్ర ఉదయం 11:30 గంటలకు గౌలిగూడ రామ్ మందిర్ నుంచి మొదలై.. రాత్రి 8 గంటలకు తడ్బండ్ హనుమాన్ టెంపుల్‌కు చేరుకుంటుంది.




* రూట్ మ్యాప్: మొత్తం 12 కిలోమీటర్ల యాత్రలో 2 కిలోమీటర్ల మేర మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో సాగుతుంది.
* ఉప యాత్రలు: కర్మన్‌ఘాట్ సహా వివిధ ఏరియాల నుంచి మరో 14 చిన్న యాత్రలు మెయిన్ ర్యాలీలో కలుస్తాయి.
* లోకల్ సందడి: ఇవి కాకుండా కమిషనరేట్ వ్యాప్తంగా మరో 92 లోకల్ ఊరేగింపులు జరగనున్నాయి.




**ఈ రూట్లలో పోతే ట్రాఫిక్ కష్టాలే!**

యాత్ర సాగే సమయంలో కింది ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉండే ఛాన్స్ ఉంది:
ముఖ్య ప్రాంతాలు: CTO తడ్బండ్, ఆనంద్‌బాగ్, సఫిల్‌గూడ, నేరెడ్‌మెట్, ఈసీఐఎల్, ఏఎస్ రావు నగర్, సైనిక్‌పురి, యాప్రాల్, హస్మత్‌పేట్, తార్నాక, హబ్సిగూడ, ఎల్బీ నగర్.

**నో పార్కింగ్.. నో ఎంట్రీ..**

* యాత్ర జరిగే రూట్లలో రోడ్లపై బండ్లు ఆపితే టోయింగ్ చేస్తారు.
* భారీ వాహనాలు: ఆర్టీసీ బస్సులు, లారీలు, సరుకు రవాణా వాహనాలకు అనుమతి లేదు. వేరే రూట్లలోకి మళ్లిస్తారు.

*** భక్తుల కోసం పార్కింగ్ ఇక్కడే.. (తడ్బండ్ వద్ద)**

* బైకులు: ధోబీ ఘాట్ దగ్గర పార్క్ చేయాలి.
* కార్లు: హనుమంత రెడ్డి కాంప్లెక్స్ (తడ్బండ్ ఎక్స్ రోడ్స్).
* బస్సులు: కార్ఖానాలోని ఇంపీరియల్ గార్డెన్స్ ముందున్న గ్రౌండ్.
* అలెర్ట్: ప్రయాణికులు ఈ మార్పులను గమనించి తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని డీసీపీ (ట్రాఫిక్) కోరారు. ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే 112 లేదా మల్కాజిగిరి ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్లు 8712662999, 8712662850 కు కాల్ చేయొచ్చు.

# పెట్టుబడుల పేరిట రూ.15 కోట్ల మోసం

* ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన నాగోల్ పోలీసులు

ఎల్బీనగర్, ఏప్రిల్ 01 (భారత శక్తి): నెలకు భారీ వడ్డీ ఆశ చూపిస్తూ పెట్టుబడిదారులను వలలో వేసి కోట్ల రూపాయలు కాజేసిన మోసగాళ్లను నాగోల్ పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. సుమారు 290 మంది నుంచి రూ.30 కోట్ల వరకు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెట్టుబడుల పేరుతో ప్రజలను ఆకర్షించి భారీ ఆర్థిక మోసానికి పాల్పడిన సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జాన్ తెలిపిన వివరాల ప్రకారం, బండ్లగూడ ఆనంద్ నగర్‌కు చెందిన కిచ్చ వీరభద్రరావు (51) తన భార్య రాజ్యలక్ష్మి, సహాయకుడు వెంకట దుర్గా ప్రసాద్‌తో కలిసి నాగోల్ డివిజన్‌లోని కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీ, రోడ్ నెంబర్ 13లో 2024 జూన్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని "వీరభద్ర ట్రేడింగ్" పేరుతో కార్యాలయం ప్రారంభించారు. ఈ సంస్థలో లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టిన వారికి నెలకు రూ.10 వేల చొప్పున వడ్డీ చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు, స్థానికులు ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలో సుమారు 290 మంది వినియోగదారులు రూ.30 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు పోలీసులు తెలిపారు.




మొదట్లో కొంతమందికి వడ్డీ చెల్లిస్తూ నమ్మకం కల్పించిన నిందితులు, 2025 మే నెలలో గుర్గాంలో వీరభద్రరావుపై సైబర్ క్రైమ్ కేసు నమోదు కావడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. అప్పుల భారంతో రూ.30 కోట్లలో రూ.15 కోట్లు మాత్రమే తిరిగి చెల్లించి, మిగతా రూ.15 కోట్ల చెల్లింపులను నిలిపివేశారు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మహమ్మద్ మక్బూల్ జాన్ మాట్లాడుతూ, అధిక లాభాల ఆశకు లోనవకుండా పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## టీచర్ ముస్త్యాల కుమారస్వామి కుటుంబాన్ని
# పరామర్శించిన కల్లు గీత కార్మిక సంఘము నాయకులు

జనగామ, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 01: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కోలుకొండ గ్రామానికి చెందిన టీచర్ ముస్త్యాల కుమారస్వామి తల్లి ముస్త్యాల చిన్న మల్లమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈరోజు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య, మండల అధ్యక్షులు పరీదుల భాస్కర్, గ్రామ అధ్యక్షులు కన్న రామ్మూర్తి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మిట్ట బిక్షపతి వారిని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరితోపాటు టీచర్ మేకల పద్మావతి, మేకల కామేష్ తదితరులు ఉన్నారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.